


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక
PEN POWER TELUGU DAILY
ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 11 | సంచిక : 130 | పేజీలు : 8+8 | ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ : పి. గౌతమి | సోమవారం 13 జనవరి 2025

Published form Medchal Malkajgiri, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda

## మంత్రుల సమీక్షలో రచ్చ...
## ఎమెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, సంజయ్ మధ్య తోపులాట

- కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ లో మంత్రుల సమీక్ష
- హాజరైన ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు
- ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతుండగా అడ్డుకున్న కౌశిక్ రెడ్డి
- కౌశిక్ రెడ్డిని బయటికి తీసుకెళ్లిన పోలీసులు



**హైదరాబాద్ పెన్ పవర్:**కరీంనగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన మంత్రుల సమీక్ష రసాభాస అయింది. మంత్రుల సమక్షంలోనే ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, సంజయ్ కొట్టుకోబోయారు. కరీంనగర్ జిల్లా ఇన్చార్జి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఇతర మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. అయితే, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతున్న సమయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అభ్యంతరం చెప్పారు.

వివరాలు 2లో..



# అధికార పక్షం,ప్రతిపక్షం కలిస్తేనే ప్రభుత్వం

- అవసరం ఉన్న చోట విపక్ష నేతల అనుభవాన్ని ఉపయోగించుకుంటాం: సీఎం రేవంత్ రెడ్డి
- మాజీ గవర్నర్ విద్యాసాగర్ రావు ఆత్మకథ పుస్తకావిష్కరణ కార్యక్రమం
- హాజరైన సీఎం రేవంత్ రెడ్డి
- తాను ఎవరి సలహాలైనా స్వీకరిస్తానన్న సీఎం
- తనకు ఎలాంటి భేషజాలు లేవని స్పష్టీకరణ

**హైదరాబాద్ పెన్ పవర్:** అధికారపక్షం,ప్రతిపక్షం కలిస్తేనే ప్రభుత్వం అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తనకు ఎలాంటి భేషాజాలు లేవని..ఎవరి సలహాలనైనా స్వీకరిస్తానని తెలిపారు. ప్రస్తుతం చట్ట సభల స్ఫూర్తిని కోల్పోతున్నామని, విపక్షాల విమర్శలు చేయడానికి ,సలహాలు ఇవ్వడానికి అవకాశం ఉండాలన్నారు. ప్రభుత్వం ప్రతిపక్షానికి విలువ ఇస్తోందని, అప్పటివరకు అసెంబ్లీలో ఒక్క సభ్యుడిని కూడా సస్పెండ్ చేయలేదని గుర్తుచేశారు. గతంలో విశ్వవిద్యాలయాల నుండి రాజకీయ నేతలు వచ్చారని తెలిపారు. మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్ రావు ఆత్మకథ 'ఉనికి' పుస్తకాన్ని సీఎం. రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. హైదరాబాద్ తాజ్ కృష్ణలో నిర్వహించిన కార్యక్రమానికి కేంద్రమంత్రి బండి సంజయ్ గవర్నర్లు బండారు దత్తాత్రేయ. హరిబాబు, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎంపీ లక్ష్మి బీ తదితరులు హాజరయ్యారు. ఈసంద ర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడుతూ 'అసెంబ్లీలో




అధికారపక్షమే కాదు ప్రతిపక్షం కూడా ముఖ్యమే. ఇప్పటి వరకు శాసనసభలో ఏ ఒక్క ప్రతిపక్షసభ్యుడి ని సస్పెండ్ చేయలేదు. తెలంగాణ ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని కృషి చేస్తున్నం. దేశాభి వృద్ధి కోసం మోదీతో కలిసి పనిచేస్త. పెండింగ్ జెక్టులకు అనుమతి ఇవ్వాలని ప్రధానిని కోరాను. కాజీపేట రైల్వే డివిజన్, మెట్రో విస్తరణ, ట్రిపుల్ ఆర్ విస్తరణకు బండి సంజయ్ కేంద్రంతో మట్లాడాడాలి. స్కిల్ వర్సిటీ ద్వారా యువతలో నైపుణ్యాల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నం. తెలంగాణ నుంచి

వివరాలు 2లో..

## జనవరి 26 నుంచి రేషన్ కార్డుల పంపిణీ



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలో 2025, జనవరి 26వ తేదీ నుంచి కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. కరీంనగర్ ఇంచార్జ్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన ఆదివారం (జనవరి 12) ఉమ్మడి కరీంనగర్ జిల్లా సమీక్ష సమావేశం కలెక్టరేట్లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన

వివరాలు 2లో..

## ఛత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్... ముగ్గురు నక్సల్స్ మృత్యువాత



- బీజాపూర్‌లో భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు
- ఘటనా స్థలంలో ఆటోమేటిక్ ఆయుధాలు, పేలుడు పదార్థాలు గుర్తింపు
- ఇంకా కొనసాగుతున్న సెర్చ్ ఆపరేషన్

**హైదరాబాద్ పెన్ పవర్:**ఛత్తీస్‌గఢ్‌లో ఆదివారం మరో ఎన్‌కౌంటర్ జరిగింది. బీజాపూర్ జిల్లాలో భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావో యిస్టులు మృతి చెందారని పోలీసులు ప్రకటించారు. ఇంద్రావతి నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో భద్రతా బలగాల సంయుక్త బృందం యాంటి-నక్సలైట్ ఆపరేషన్ చేపట్టిందని బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ తెలిపారు. డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డీఆర్‌జీ), స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్‌టీఎఫ్), డిస్ట్రిక్ట్ ఫోర్స్‌కు చెందిన సిబ్బంది ఉమ్మడిగా ఈ ఆపరేషన్ నిర్వహించారని, సెర్చ్ ఆపరేషన్ ఇంకా కొనసాగుతోందని

వివరాలు 2లో..

## రేవంత్ సర్కార్ రైతులను నట్టేట ముంచింది



**హైదరాబాద్ పెన్ పవర్:** రేవంత్ సర్కార్ రైతులను నట్టేట ముం చిందన్నారు మాజీ మంత్రి హరీశ్ రావు. మళ్లీ సిగ్గులేకుండా సంబ రాలు చేసుకోవాలం

వివరాలు 2లో..



'భోగ భాగ్యాలనిచ్చే భోగి సరదానిచ్చే సంక్రాంతి కమ్మని కనుమ' కొత్త సంవత్సరంలో కొత్త వెలుగులను నింపాలని కోరుకుంటూ..
మీకు, మీ కుటుంబ సభ్యులకు భోగి శుభాకాంక్షలు

## సంక్రాంతికి చలో.. హైదరాబాద్-విజయవాడ హైవేపై భారీ రద్దీ

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరా బాద్, చౌటుప్పల్ గ్రామీ ణం: సంక్రాంతి పండగ నేపథ్యం లో హైదరాబాద్ నగరవాసులు సొం తూళ్ల బాట పట్టారు. దీంతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ కొనసాగుతోంది. చౌటుప్పల్

వివరాలు 2లో..



## కెనడా ప్రధాని రేసు నుంచి తప్పుకున్న భారత సంతతి మహిళ అనిత

- కెనడా ప్రధాని పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించిన జస్టిన్ ట్రూడో
- ప్రధాని పదవి రేసులో అనిత ఇందిరా ఆనంద్
- అనూహ్యరీతిలో పోటీ నుంచి వైదొలగిన అనిత
- ఇకపై ఎంపీగా కూడా పోటీచేయబోనని వెల్లడి

వివరాలు 2లో..



## దగ్గుబాటి కుటుంబంపై కేసు నమోదు...
## ఏ2గా విక్టరీ వెంకటేశ్



- ఓ స్థల వివాదంలో నాంపల్లి కోర్టు ఆదేశాలు
- వెంకటేశ్, రానా, తదితరులపై కేసు
- పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన ఫిలిం నగర్ పోలీసులు

**హైదరాబాద్ పెన్ పవర్:**డెక్కన్ కిచెన్ హోటల్ వివాదంలో సినీ హీరో దగ్గుబాటి వెంకటేశ్ కుటుంబంపై కేసు నమోదైంది. ఈ కేసు ఎఫ్ఐఆర్ లో విక్టరీ వెంకటేశ్ ను ఏ2గా పేర్కొన్నారు. నందకుమార్ అనే వ్యక్తికి, దగ్గుబాటి కుటుంబానికి డెక్కన్ కిచెన్ హోటల్ స్థలం విషయంలో వివాదం నడుస్తోంది. 2022లో జీహెచ్ఎంసీ సిబ్బంది, బౌన్సర్లతో కలిసి దగ్గుబాటి కుటుంబం ఈ హోటల్ ను కొంతమేర ధ్వంసం చేసింది. నందకుమార్ దీనిపై హైకోర్టును ఆశ్రయించడంతో... ఆ స్థలంలో ఎలాంటి చర్యలకు పాల్పడవద్దని, యథాతథ

వివరాలు 2లో..

## ఎన్నికలంటేనే భయం వేస్తోంది



**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్ర విభజన జరిగి పదేళ్లయినా ఇంకా సమస్యలున్నాయని మాజీ సీఎం, భాజపా నేత కిరణ్‌కుమార్ రెడ్డి అన్నారు. విజయ వాడలో హైకోర్టు న్యాయవాది రవితేజ ఆధ్వర్యంలో నిర్వహిం చిన 'సంక్రాంతి

వివరాలు 2లో..

## ఫార్ములా ఈ రేసులో కేటీఆర్‌కు క్లీన్ సర్టిఫికెట్ ఇవ్వలేదు



- నేనేం మాట్లాడినా సెన్సేషనే అవుతోంది: దానం నాగేందర్
- కేటీఆర్ కు తాను క్లీన్ చిట్ ఇవ్వలేదని వ్యాఖ్య
- ఫార్ములా కార్ రేస్ తో హైదరాబాద్ ఇమేజ్ పెరిగిందని చెప్పానన్న ఎమ్మెల్యే
- హైడ్రా వల్ల ప్రభుత్వానికి డ్యామేజ్ జరిగిందనే వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నట్లు వెల్లడి

వివరాలు 2లో..

## మీరు ఆ పని చేయండి.. వచ్చే ఎన్నికల్లో పోటీ చెయ్యను

### బీజేపీకి కేజ్రీవాల్ ఛాలెంజ్



**హైదరాబాద్ పెన్ పవర్:** వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలిస్తే ఢిల్లీలోని మురికివాడలను కూల్చేస్తోం దని ఆప్ జాతీయ కన్వీనర్, మాజీ సీఎం కేజ్రీవాల్ ఆరోపించారు. కేజ్రీవాల్ మురికివా డలు నిర్మిస్తానని చెప్పి.. విలాసవంతమైన శీష్ మహాల్ నిర్మించుకున్నాడని కేంద్రమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు కేజ్రీ కౌంటర్ ఇచ్చారు. ఆదివారం (జనవరి 12) షకుర్ బస్తీలోని మురికివాడలను కేజ్రీవాల్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీకి మురికివాడలంటే ప్రేమ లేదు.. అది సంపన్నుల పార్టీ.. వాళ్లకు మురికివాడల వాళ్లతో సంబంధం ఏంటి..? అని ప్రశ్నించారు. బీజేపీ నేతలు మురికివాడల ప్రజలను కీటకాలుగా పరిగణిస్తారని ఆరోపించారు. ఎన్నికల ముందు మాత్రమే మురికివాడల సమస్యల గురించి వాళ్లు మాట్లాడుతారని.. ఆ తర్వాత వారు మురికివాడల భూములు

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# ఫ్యాన్ స్పీడ్ కు చెక్

ఇటీవల విశాఖపట్నంలో జరిగిన సభలో మోదీని ఉద్దేశించి చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు నిజమేననిపిస్తుంది. మీ స్కూల్.. నా స్కూల్ ఒకటేనని చంద్రబాబు అన్నది అభివృద్ధి.. విజన్ గురించి. అయితే ప్రత్యర్థిని కట్టడి చేయడానికి దూరం చేయడంలో కూడా ఇద్దరి స్కూలు ఒకటే. మోదీ మంత్రాంగంతోనే నేడు అనేక రాష్ట్రాల్లో కమలం పార్టీ జెంగా ఎగురగలిగింది. ఏ ఎన్నిక జరిగినా అది బీజేపీ ఖాతాలో పడటం సర్వసాధారణమయింది. జనాలకు కూడా ఇది పెద్దగా ఆశ్చర్య పోవాల్సిన పనిలేకుండా పోయింది. ఎందుకంటే ముందుగానే బీజేపీ విజయాన్ని అంచనా వేసుకుంటున్నారు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా అదే సిలబస్ ను పాటిస్తున్నట్లే కనిపిస్తుంది. ప్రత్యర్థులు బలంగా ఉన్న చోట వీక్ చేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు కనిపిస్తుంది. పైకి ఎవరికీ ఇది అర్థం కాకపోయినా లోతుగా అధ్యయనం చేసే రాజకీయ విశ్లేషకులకు మాత్రం ఇది సులువుగానే అర్థమవుతుంది.

**ఎప్పుడు ఎన్నికలు వచ్చినా...?**

ఎన్నికలు ఎప్పుడు జరిగినా తిరిగి కూటమి అధికారంలోకి రావాలన్నది చంద్రబాబు ఆలోచన. అందుకు మూడు పార్టీలూ కలసి పోటీ చేస్తాయి. ప్రధానంగా ఆంధ్రప్రదేశ్ లో జగన్ బలమైన శత్రువు. జగన్ ను అంత తేలిగ్గా చంద్రబాబు అంచనా వేయరు. ఎందుకంటే 2024 ఎన్నికల్లోనూ జగన్ ఒంటరిగా పోటీ చేసి 40 శాతం ఓట్లు తెచ్చుకున్నారంటే ఆషామాషీ కాదన్న సంగతి నలభై ఐదేళ్ల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబుకు తెలియంది కాదు. ఐదు శాతం ఓట్లు పెరిగినా సీట్లు గల్లంతవుతాయి. అందుకే జగన్ కు బలమైన ప్రాంతాల్లో చంద్రబాబు ఫోకస్ పెట్టినట్లు సమాచారం. ఇందుకోసం ప్రత్యేక స్ట్రాటజీలతో చంద్రబాబు వెళుతున్నట్లే కనిపిస్తుంది. ఒకవైపు పాలనను గాడిలో పెడుతూనే మరొక వైపు జగన్ ను మరింత బలహీనం చేసే ప్రయత్నంలో చంద్రబాబు నిరంతరం స్కెచ్ వేస్తుంటారన్నది కాదనలేని వాస్తవం.

**పవన్ ను ప్రయోగించి...**

అందులో భాగంగానే పవన్ కల్యాణ్ ను ప్రయోగించినట్లు సమాచారం. జనసేన అధినేత పవన్ కల్యాణ్ కు యువతలోనూ, సామాజికవర్గంలోనూ బలమైన పట్టుంది. రాయలసీమలో జగన్ బలం తక్కువేమీ కాదు. అక్కడ రెడ్డి సామాజికవర్గం ఎక్కువ కావడంతో పాటు వైఎస్ రాజశేఖర్ రెడ్డి అభిమానంతో పాటు టీడీపీ వ్యతిరేక ఓట్ల శాతం ఒకింత ఎక్కువగానే ఉన్నాయి. కానీ గత ఎన్నికల్లో ఎప్పుడూ లేని విధంగా రాయలసీమలోనూ కూటమి అత్యధిక స్థానాల్లో విజయం సాధించడానికి పవన్ కల్యాణ్ కూడా ఒక కారణమని ఆయన నమ్ముతున్నారు. అందుకే జగన్ సొంత జిల్లా అయిన కడపలోనే కేవలం వైసీపీని మూడు సీట్లకే పరిమితం చేయగలిగామన్నా, ఎన్నడూ గెలవని సీట్లను గెలుచుకున్నా, సుదీర్ఘకాలం తర్వాత నియోజకవర్గాలను సొంతం చేసుకున్నా అందులో పవన్ కల్యాణ్ పాత్ర ఎక్కువగా ఉందని చంద్రబాబు విశ్వసిస్తున్నారు.

**బలిజ సామాజికవర్గం ఓట్లను...**

అందుకే రాయలసీమపై పవన్ కల్యాణ్ ను చంద్రబాబు ప్రయోగించినట్లే కనపడుతుంది. పవన్ కల్యాణ్ పర్యటించకున్నా ఉభయ గోదావరి జిల్లాల్లో కూటమి బలంగా ఉంటుంది. ఇక కోస్తాంధ్ర, ఉత్తరాంధ్రలలో తెలుగుదేశం పార్టీ పట్టు సడలదు. ఇక రాయలసీమలో దాదాపు యాభై రెండు నియోజకవర్గాల్లో అత్యధిక స్థానాలను సొంతం చేసుకోవాలంటే అంత సులువు కాదు. జగన్ ను దెబ్బకొట్టాలంటే అక్కడ ఉన్న మరో బలమైన సామాజికవర్గం బలిజలను తమవైపునకు తిప్పుకోవాలి. అందుకే పవన్ కల్యాణ్ తరచూ కడప, కర్నూలు జిల్లాల్లో పర్యటిస్తున్నారని చెబుతున్నారు. చంద్రబాబు సూచనల మేరకే పవన్ కల్యాణ్ సీమ జిల్లాల్లో పర్యటనలు చేస్తున్నారని సమాచారం. కడపలో కూడా క్యాంప్ కార్యాలయం ప్రారంభిస్తానని పవన్ కల్యాణ్ చేసిన ప్రకటన వెనక కూడా ఇదే ప్రధాన కారణం అని అంటున్నారు. మొత్తం మీద చంద్రబాబు స్కూలులో సిలబస్ మారినట్లే కనిపిస్తుంది.

# అధికార పక్షం, ప్రతిపక్షం కలిస్తేనే ప్రభుత్వం

- మొదటి పేజి తరువాయి

ఒలిం పెక్స్ లో పతకం సాధించడానికి కృషి చేస్తున్న త్వరలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటుచేస్తం. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో కొన్ని రాష్ట్రాలో అన్ని పార్టీలు కలిసిపో ఆడుతున్నాయి" అని తెలిపారు.

**ఒక్క మరకలేదు**

విద్యాసాగర్ రావు ఆదర్శనీయమైన నేత. సుధీర్ఘ కాలం రాజకీయాల్లో ఉన్నా ఒక్క మరక లేదు. ఇంత వరకు వ్యక్తిగతంగా ఎవరూ ఆరోపణలు చేయలేదు. నమ్మిన సిద్ధాంతం కోసం కట్టుబడి ఉన్నారు. గోదావరి జలాల కోసం విద్యాసాగర్ రావు ఉద్యమించారు. కానీ ఆయన కల ఇప్పటికీ నెరవేరలేదు. మ్మిడిహెట్టి భూసేకరణకు తీసుకుంటం. గోదావరి జలాలను సద్వినియోగం చేసుకుంటం' అని సీఎం రేవంత్ చెప్పారు. మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్ రావు ఆత్మకథ 'ఉనిక' పుస్తకావిష్కరణ కార్యక్రమానికి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు. పుస్తకావిష్కరణ కార్యక్రమంలో రేవంత్ రెడ్డి ప్రసంగిస్తూ... విపక్ష నేతలు అయినా సరే, వారి అనుభవం అవసరం అనుకుంటే తప్పకుండా స్వీకరిస్తామని చెప్పారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం పలు రాష్ట్రాల్లో అధికార, విపక్షాలు అని తేడా లేకుండా అన్ని పార్టీలు కలిసికట్టుగా పోరాడుతున్నాయని అన్నారు. తనకు ఎటువంటి భేషజాలు ఉండవని, ఎవరి నుంచైనా సలహాలు తీసుకుంటానని స్పష్టం చేశారు. విద్యాసాగర్ రావు వంటి వ్యక్తుల అనుభవం రాష్ట్రానికి ఎంతో అవసరం అని రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్రం ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రూపొందేలా పాటుపడుతున్నామని అన్నారు. మనం పోటీ పడాల్సింది అమరావతితో కాదని... ప్రపంచ నగరాలతో అని తమ వైఖరిని చాటిచెప్పారు. కేంద్రం చేయూత అందిస్తేనే రాష్ట్రాల అభివృద్ధి పరిపూర్ణమవుతుందని... మెట్రో, ఆర్ఆర్ఆర్ అంశాల్లో సహకారం అందించాలని ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేశానని రేవంత్ వెల్లడించారు.

# జనవరి 26 నుంచి రేషన్ కార్డుల పంపిణీ

- మొదటి పేజి తరువాయి

మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాటు కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదని విమర్శించారు. గత పదేళ్లలో కేవలం 49 వేలు కార్డులు మాత్రమే ఇచ్చారన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 90 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయం తీసుకొని కొత్త రేషన్ కార్డులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రేషన్ దుకణాల్లో తినడానికి వీలులేని బియ్యం ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డుల కింద ఒక్కరికీ 6 కిలోల చొప్పున సన్నబియ్యం ఇచ్చేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. ఇండ్ల స్థలం ఉండి, ఇండ్లు లేని వారికి కట్టించేందుకు రెడీ అవుతున్నామని.. నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్ రూం ఇండ్లు పూర్తిచేసి వాటిని ప్రజలకు కేటాయిస్తామని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఒక్క ఏడాదిలోనే 55వేల ఉద్యోగాలు ఇచ్చామని.. రైతులకు రూ.22.500 కోట్లు రుణమాఫీ చేశామని గుర్తు చేశారు. తాను సుధీర్ఘకాలంగా రాజకీయాల్లో ఉన్నానని.. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు పథకాలు యావత్ భారతదేశంలో ఎక్కడా లేవని అన్నారు. అన్ని జిల్లాలు తిరిగి రైతు భరోసాపై స్పష్టమైన అవగాహనకు వచ్చి వ్యవసాయ యోగ్యమైన భూమికి ఎకరాకు 12వేలు ఇవ్వాలని నిర్ణయించామని తెలిపారు. వ్యవసాయ కూలీలకు ఏ రాష్ట్రంలో లేని విధంగా రూ.12 వేలు ఆర్థిక సహాయం అందజేస్తామన్నారు. ఇక జిల్లాలోని రోళ్లవాగు ప్రాజెక్టుకు షట్టర్లు బిగించి, రైతులకు ఉపయోగపడేలా చేస్తామని.. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అవసరమైన ప్రతి ప్రాజెక్టును నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కరీంనగర్ అభివృద్ధికి- ఉమ్మడి జిల్లాలోని అందరు కలెక్టర్లకు స్పష్టమైన కార్యాచరణ ఇచ్చామని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ముందుకు పోదామని.. ప్రభుత్వం తీసుకొచ్చే ప్రతి పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మెల్యేలు కౌశిక్ రెడ్డి, సంజయ్ ల మధ్య జరిగిన వాగ్వాదంపైన ఉత్తమ్ స్పందించారు. కౌశిక్ రెడ్డి తీరు సరికాదని.. ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నానని అన్నారు.

# రేవంత్ సర్కార్ రైతులను నట్టేట ముంచింది

- మొదటి పేజి తరువాయి

టున్నారని విమర్శించారు. వానకాలం రైతుబంధు ఎగ్గొట్టారని.. యాసింగికి కోతలు పెట్టారని విమర్శించారు. ఎకరానికి 15 వేలు ఇస్తామని 12 వేలు అంటున్నారు. రైతు డిక్లరేషన్ లో ఇచ్చిన ఒక్క హామీ అయినా నెరవేర్చారా? అని ప్రశ్నించారు. ఊళ్లలోకి వచ్చే కాంగ్రెస్ నేతలను రైతులు నిలదీయాలని సూచించారు.

కౌలు రైతులకు కూడా రైతు భరోసా ఇస్తామని హామీ ఇచ్చారు..కౌలు రైతుల గురించి ప్రశ్నిస్తే ప్రభుత్వం సమాధానం చెప్పడం లేదన్నారు హరీశ్ రావు. రైతులకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోనందుకే సంబరాలు పాలాభిషేకాలు చేయాలా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ హామీలపై ఎక్కడైనాచర్చకు సిద్ధమన్నారు. ఎకరం భూమి ఉన్న రైతులను కూడా రైతు కూలీలుగా గుర్తించాలి.. అలాంటి వారికి రైతు కూలీలకు ఇచ్చే పథకం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు హరీశ్ రావు.

# ఫార్ములా ఈ రేసులో కేటీఆర్‌కు క్లీన్ సర్టిఫికెట్ ఇవ్వలేదు

**హైదరాబాద్ పెన్ పవర్:** ఫార్ములా ఈ కార్ రేస్ తో హైదరాబాద్ ఇమేజ్ పెరిగిందనే వ్యాఖ్యలకు తాను కట్టుబడి ఉన్నట్లు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. అదేసమయంలో ఈ రేస్ లో అవినీతి జరగలేదని తాను చెప్పడంలేదని, మాజీ మంత్రి కేటీఆర్ కు తానేమీ క్లీన్ చిట్ ఇవ్వలేదనే విషయం గుర్తించాలని చెప్పారు. తాను ఏం మాట్లాడినా సంచలనమే అవుతోందని అన్నారు. హైడ్రాతో కాంగ్రెస్ ప్రభుత్వానికి డ్యామేజ్ జరిగిందనేది వాస్తవమని వివరించారు. హైడ్రా విషయంలో పునరాలోచన చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నానని, ఈ విషయంలో తన అభిప్రాయం మారదని చెప్పారు. తాను ఓ ఫైటర్ అని, ఉప ఎన్నికకు భయపడనని తేల్చిచెప్పారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... మూసీ వ్యవహారంపై కంటి తుడుపు చర్యలాగా బీజేపీ నేతలు ఒక్కరోజు నిద్ర చేశారని, అక్కడికి వెళ్లే ముందే ఏసీలు పెట్టించుకున్నారని విమర్శించారు. స్థానికులు చేసిన జొన్న రొట్టెలు కాకుండా కిషన్ రెడ్డి బయటి నుంచి ఇడ్లీలు తెప్పించుకుని తిన్నారని ఆరోపించారు. ఓ ఇంటర్వ్యూలో హైడ్రాపై తాను చేసిన వ్యాఖ్యలను వక్రీకరించి మీడియాలో కొంతమంది తప్పుడు ప్రచారం చేస్తున్నారని దానం నాగేందర్ మండిపడ్డారు. ఫార్ములా కార్ రేస్ నిర్వహించేందుకు అప్పట్లో మంత్రిగా ఉన్న కేటీఆర్ తనను కూడా సలహా అడిగారని దానం నాగేందర్ చెప్పారు. ఈ కార్ రేస్ వల్ల హైదరాబాద్ ఇమేజ్ పెరుగుతుందని తన అభిప్రాయం చెప్పానని తెలిపారు. ప్రస్తుతం ఈ వ్యవహారానికి సంబంధించి కోర్టులో కేసు నడుస్తున్నందున ఎక్కువగా మాట్లాడబోనని వివరించారు. రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉన్నప్పటికీ ఎన్నికల హామీలను ప్రభుత్వం అమలు చేస్తోందని, రైతు రుణ భరోసా అమలు చేసిన రోజు సంబరాలు జరపాల్సిందని దానం అభిప్రాయపడ్డారు.

# కెనడా ప్రధాని రేసు నుంచి తప్పుకున్న భారత సంతతి మహిళ అనిత

**పెన్ పవర్ డెస్క్:** కెనడా రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. ప్రధాని పదవి రేసు నుంచి తప్పుకుంటున్నట్టు భారత సంతతి మహిళా నేత, ప్రస్తుత రవాణా శాఖ మంత్రి అనిత ఇందిరా ఆనంద్ ప్రకటించారు. ఇటీవల ప్రధాని పదవి నుంచి తప్పుకుంటున్నట్టు జస్టిన్ ట్రూడో ప్రకటించిన సంగతి తెలిసిందే. దాంతో తదుపరి ప్రధాని రేసులో అనిత కూడా ఉన్నారు. పీఎం రేసులో తుది ఐదు మంది నేతల్లో ఆమె ఒకరు.

ఇప్పుడు అనూహ్య రీతిలో ఆమె రేసు నుంచి వైదొలగడం చర్చనీయాంశంగా మారింది. అంతేకాదు, మళ్లీ ఎంపీగా పోటీ చేయనని సంచలన ప్రకటన చేశారు. భవిష్యత్తులో విద్యారంగంలో సేవలు అందించాలని కోరుకుంటున్నానని అనిత తెలిపారు. తదుపరి ఎన్నికలు జరిగే వరకు పదవీ బాధ్యతల్లో కొనసాగుతానని వెల్లడించారు. 57 ఏళ్ల అనిత ఆనంద్ తమిళ, పంజాబీ మూలాలున్న వ్యక్తి. ఆమె తండ్రి తమిళనాడుకు చెందిన డాక్టర్, తల్లి పంజాబ్ కు చెందిన మహిళ. అనిత 2019లో కెనడాలోని ఓక్ విల్లే పార్లమెంటు స్థానం నుంచి గెలుపొందారు. ట్రూడో క్యాబినెట్ లో తొలుత ప్రజా సేవల మంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత రవాణా మంత్రిగా బాధ్యతలు అందుకున్నారు.

# ఛత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్... ముగ్గురు నక్సల్స్ మృత్యువాత

- మొదటి పేజి తరువాయి

సుందర్‌రాజ్ వివరించారు. ఎన్‌కౌంటర్ జరిగిన స్థలంలో ఆటోమేటిక్ ఆయుధాలు, పేలుడు పదార్థాలను గుర్తించామని తెలిపారు. చనిపోయిన ముగ్గురు మావోయిస్టులు యూనిఫామ్‌లో ఉన్నారని వివరించారు.

కాగా, ఛత్తీస్‌గఢ్‌లో వరుస ఎన్‌కౌంటర్లు జరుగుతున్నాయి. గతేడాది నవంబర్ నుంచి నక్సల్స్ ఏరివేత ఆపరేషన్లు జోరుగా కొనసాగుతున్నాయి. 2025లో వేర్వేరు ఎన్‌కౌంటర్లలో కలిపి ఇప్పటికే 12 మంది మావోయిస్టులు హతమయ్యారు. నారాయణపూర్, దంతేవాడ, బీజాపూర్ జిల్లాల సరిహద్దుల్లో అటవీప్రాంతంలో మూడు రోజులపాటు జరిగిన యాంటీ నక్సల్స్ ఆపరేషన్‌లో ఇద్దరు మహిళలు సహా ఐదుగురు నక్సల్స్ చనిపోయారు. జనవరి 6న

ఈ ఆపరేషన్ ముగిసింది. ఇక జనవరి 9న సుక్మా జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృత్యువాతపడ్డారు. జనవరి 3న రాయ్‌పూర్ డివిజన్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఒక నక్సలైట్ హతమయ్యాడు. గతేడాది 2024లో రాష్ట్రంలో జరిగిన వేర్వేరు ఎన్‌కౌంటర్లలో మొత్తం 219 మంది నక్సలైట్లను భద్రతా బలగాలు మట్టుబెట్టాయి.

## మంత్రుల సమీక్షలో రచ్చ... ఎమెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, సంజయ్ మధ్య తోపులాట

- మొదటి పేజి తరువాయి

సంజయ్ గత ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున గెలిచి ఆ తర్వాత కాంగ్రెస్ లోకి వెళ్లారు. ఇదే అంశాన్ని కౌశిక్ రెడ్డి నేటి మంత్రుల సమీక్షలో ప్రస్తావించారు. నువ్వు ఏ పార్టీ తరపున గెలిచావు? ఆ తర్వాత ఏ పార్టీలోకి వెళ్లావు?... అసలు నీ పార్టీ ఏది? అంటూ కౌశిక్ రెడ్డి... సంజయ్ పై మండిపడ్డారు. దాంతో, ఇద్దరు ఎమ్మెల్యేల మధ్య వాగ్వాదం నెలకొంది. ఇరువురు నేతలు పరుష పదజాలంతో దూషించుకున్నారు. ఒకరినొకరు నెట్టుకునే వరకు వెళ్లింది. దాంతో అక్కడున్న నేతలు కౌశిక్ రెడ్డిని నిలువరించారు. ఈ దశలో పోలీసులు రంగప్రవేశం చేసి బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని సమీక్ష నుంచి బయటికి తీసుకెళ్లారు.

# ఎన్నికలంటేనే భయం వేస్తోంది

- మొదటి పేజి తరువాయి

ఆత్మీయ కలయిక' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలుగు రాష్ట్రాలు నీటి వివాదాలను పరిష్కరించుకోవాలని సూచించారు. దేశంలో అవినీతి విపరీతంగా పెరిగిపోయిం దన్నారు. ఎన్నికలంటే భయం వేస్తోందని.. రానున్న రోజుల్లో పోటీ చేయలేమని వ్యాఖ్యానించారు. డబ్బు లూటీ చేసే వాళ్లు కొందరు ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని.. ప్రజలు వారికి ఓట్లు కూడా వేస్తున్నారని చెప్పారు. నాయకులు, అధికారులు కలిసి పంపకాలు చేసుకుంటున్నారని ఆరోపించారు. ఏ పార్టీలో ఉన్నా వ్యక్తిగా తాను మారలేదన్నారు. పేదవారికి సాయం చేసే లక్ష్యంతో ఉన్నట్లు చెప్పారు. దేశ అభివృద్ధి కోసం భాజపా (%దీజ్రీ%) కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, విశ్రాంత ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

## దగ్గుబాటి కుటుంబంపై కేసు నమోదు...

# ఏ2గా విక్టరీ వెంకటేశ్

- మొదటి పేజి తరువాయి

స్థితిని కొనసాగించాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ... గతేడాది జనవరిలో దగ్గుబాటి ఫ్యామిలీ ఆ హోటల్ ను పూర్తిగా నేలమట్టం చేసింది. దాంతో నందకుమార్ నాంపల్లి కోర్టును ఆశ్రయించారు. నిన్న నందకుమార్ పిటిషన్ ను విచారించిన కోర్టు... దగ్గుబాటి కుటుంబంపై కేసు నమోదు చేసి పూర్తిస్థాయిలో విచారణ జరపాలని ఫిలింనగర్ పోలీసులను ఆదేశించింది. అంతేకాకుండా, హైకోర్టు ఆదేశాల ఉల్లంఘనపైనా చర్యలు తీసుకోవాలని పోలీసులకు స్పష్టం చేసింది. నాంపల్లి కోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో... ఫిలింనగర్ పోలీసులు దగ్గుబాటి ఫ్యామిలీపై 448, 452, 458, 120 (బి) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఎఫ్ఐఆర్ లో ఏ1గా దగ్గుబాటి సురేశ్, ఏ2గా వెంకటేశ్, ఏ3గా దగ్గుబాటి రానా, ఏ4గా దగ్గుబాటి అభిరామ్ లను పేర్కొన్నారు.

## మీరు ఆ పని చేయండి.. వచ్చే ఎన్నికల్లో పోటీ చెయ్యను

- మొదటి పేజి తరువాయి

లాక్కుంటారని నిప్పులు చెరిగారు. కేంద్రంలో పదేళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ మురికివాడలను విస్మరించి, ఓట్ల కోసం కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే వారిపై కపట ప్రేమ చూపిస్తోందని ఫైర్ అయ్యారు. "మీకు సవాల్ చేస్తున్నా.. మురికివాడల ప్రజలపై మీరు పెట్టిన కేసులన్నీ ఉపసంహరించుకోండి. ఏ భూమి నుండి వాళ్లను వెళ్లగొట్టారో అదే భూమిలో వారందరికీ ఇళ్లు ఇస్తామని కోర్టులో అఫిడవిట్ సమర్పించండి. బీజేపీ ఈ పని చేస్తే వచ్చే నేను ఎన్నికల్లో పోటీ చేయను" అని బీజేపీ కేజ్రీవాల్ ఛాలెంజ్ విసిరారు.

గత ఐదేళ్లలో బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం మురికివాడల నివాసుల కోసం కేవలం 4,700 ఫ్లాట్‌లను మాత్రమే నిర్మించిందని.. ఆ పార్టీ తీరుతో నగరంలోని 4 లక్షల మురికివాడల కుటుంబాలు అల్లాడిపోతున్నాయని పేర్కొన్నారు. బీజేపీ ఈ వేగంతో మురికివాడల్లో నివసించే వారందరికీ గృహాలను అందించడానికి 1,000 సంవత్సరాలు పడుతుందని సెటైర్ వేశారు. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ ఎన్నికలు ముగిసిన వెంటనే మురికివాడలను కూల్చివేయడానికి మార్గం సుగమం చేశారని ఆరోపించారు. మురికివాడల ఆక్రమిత భూములను రైల్వే శాఖ ఇప్పటికే టెండర్లు వేసిందని.. బీజేపీ అధికారంలోకి వస్తే మురికివాడలను కూల్చేస్తోందని ఆరోపించారు.

## సంక్రాంతికి చలో.. హైదరాబాద్-విజయవాడ హైవేపై భారీ రద్దీ

- మొదటి పేజి తరువాయి

మండలంలోని పంతంగి టోల్ ప్లాజా వద్ద వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. ఇక్కడ అరకిలోమీటరు మేర ట్రాఫిక్ నిలిచింది. ఏపీ వైపు వెళ్లే వాహనాలను 12 గేట్ల ద్వారా టోల్ సిబ్బంది పంపిస్తున్నారు. ఏపీ నుంచి హైదరాబాద్ వచ్చే వాటి కోసం 4 గేట్లు కేటాయించారు. రైళ్లలో రిజర్వేషన్ దొరక్కపోవడం, ప్రైవేటు బస్సుల్లో ఛార్జీలు భారీగా ఉండటంతో కొంత మంది బైక్‌లు, కార్లలో వెళ్తున్నారు. ఆదివారం వేకువజాము నుంచే హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో రద్దీ నెలకొంది. మరోవైపు ప్రయాణికులతో బస్టాండ్లు, రైల్వేస్టేషన్లలో రద్దీ పెరిగింది. హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లే మార్గంలో వాహనాలు కిక్కిరిశాయి. నగరం నుంచి జిల్లాలకు వెళ్లే మార్గాల్లోనూ ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎంజీబీఎస్, జేబీఎస్, దిల్‌సుఖ్‌నగర్ బస్టాండ్లు, ఎల్బీనగర్ కూడలిలో ప్రయాణికుల రద్దీ నెలకొంది.

# నోరు అదుపులో పెట్టుకో... కౌశిక్ రెడ్డికి బల్మూరి వెంకట్ వార్నింగ్




కరీంనగర్ కలెక్టరేట్ ఘటనపై రియాక్ట్ అయ్యారు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్. నోరు అదుపులో పెట్టుకుని ఒక ఎమ్మెల్యేలా ప్రవర్తించాలని కౌశిక్ రెడ్డికి వార్నింగ్ ఇచ్చారు. మీడియాలోకి రావడానికే బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి స్టంట్లు చేస్తున్నారని ఫైర్ అయ్యారు. ఎప్పుడు, ఎక్కడ, ఎవరితో ఎలా మాట్లాడాలో కౌశిక్ రెడ్డికి తెలియదన్నారు. పార్టీలపై అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. దళితులను మోసం చేసిందే బీఆర్ఎస్ అని అన్నారు బల్మూరి. ఎమ్మెల్యే కౌశిక్ వీధి రౌడివలే ప్రవర్తించకూడదన్నారు. కరీంనగర్ జిల్లా ఇంచార్జ్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన కలెక్టరేట్లో ఆదివారం (జనవరి 12) జిల్లా సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఈ సమావేశంలో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతుండగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అడ్డుకున్నాడు. "నువ్వు ఏ పార్టీలో గెలిచి, ఏ పార్టీలోకి వెళ్లావు. అసలు నీది ఏ పార్టీ" అంటూ కౌశిక్ రెడ్డి నిలదీశాడు. దీంతో ఎమ్మెల్యేలు కౌశిక్ రెడ్డి, సంజయ్ మధ్య వాగ్వాదం జరిగింది. మంత్రుల ముందే ఇద్దరు ఎమ్మెల్యేలు ఒకరిని ఒకరు తోసుకున్నారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు సమావేశం నుండి ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని బయటకు లాక్కెళ్లారు. కౌశిక్ రెడ్డి, సంజయ్ ల వాగ్వాదంతో సమావేశంలో స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది.




# నిరుద్యోగ యువత రైల్వే ఉద్యోగి ఠాగూర్ ను ఆదర్శంగా తీసుకోవాలి

**బిజెపి జిల్లా నాయకులు గుండా ఉపేందర్ రెడ్డి**

**-సీనియర్ జర్నలిస్ట్ వెంకట్**




**ఖమ్మం, పెన్ పవర్ జనవరి12:** దేశంలోనే ప్రతిష్ఠాత్మకమైన ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యను అభ్యసించి, కేంద్ర ప్రభుత్వ సంస్థ దక్షిణ మధ్య రైల్వేలో సూపరింటెండెంట్ గా ఉద్యోగం సాధించి కూసుమంచి పేరు ప్రఖ్యాతలు ఇనుమడింప చేసిన దాసోజు రవీంద్ర నాథ్ ఠాగూర్ నిరుద్యోగ యువతకు స్ఫూర్తిదాయమని బిజెపి జిల్లా నాయకులు గుండా ఉపేందర్ రెడ్డి అన్నారు. స్వామి వివేకానంద జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం నిర్వహించిన జాతీయ యువజనోత్సవం సందర్భంగా రవీంద్రనాథ్ ఠాగూర్ కి పుష్పగుచ్చం అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ ఓ వైపు ఉద్యోగం చేస్తూనే,మరోవైపు సామాజిక కార్యక్రమాలు చేస్తూ సమాజంలో బాధ్యత గల పౌరునిగా నిలిచారని తెలిపారు. సామాన్య కుటుంబంలో జన్మించి కష్ట నష్టాలను ఎదుర్కొని స్వయంకృషితో ఉన్నత స్థానానికి చేరుకున్నారన్నారు. నిరుపేదలకు ఆర్థిక సాయం,విద్యార్థులకి గురుకుల,నవోదయ వంటి పోటీపరీక్షల శిక్షణ అందించి ప్రజల మన్ననలు పొందారన్నారు. అంతే కాకుండా నిరుద్యోగ యువతకు దిక్సూచిగా స్థానిక గ్రంథాలయంలో పలు రకాల పోటీ పరీక్షల పుస్తకాలను తోటి స్నేహితులతో కలిసి వితరణగా అందించి ప్రత్యేక స్థానం సంపాదించారని ఉపేందర్ రెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గోవింద వెంకట్, కొక్కిరేణి నరేష్, విక్రమ్, గుండా విజయ్ పాల్ రెడ్డి, పిట్టల వేణు, అర్వపల్లి ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు..!

**జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి**



**పెన్ పవర్ డెస్క్. :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సుపరిపాలనలో ఆకాంక్షిత జిల్లాగా వైఎస్ఆర్ కడప జిల్లాలో.. అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రజలకు సంతృప్త స్థాయిలో అందుతున్నందుకు సంతోషంగా ఉందని.. ఈ సంక్రాంతి పండుగ జిల్లా ప్రజలకు మరిన్ని శుభాలు అందించాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఆకాంక్షించారు. భోగి మంటల వెచ్చటి వెలుగులు పరిపూర్ణమైన ఆరోగ్యాన్ని ప్రసాదించాలని... మకర సంక్రాంతి కాంతులతో ప్రతీ ఇల్లు సంక్షేమ,. సౌభాగ్యాలతో శోభాయమానంగా వెలుగొందాలని.. కనుమ కాంతులతో పల్లెసీమలు.. పశు సంపద, వ్యవసాయ, ఉద్యాన పంటలతో సుభిక్షంగా కలకళలాడాలని ఆకాంక్షిస్తూ... ఆదివారం జిల్లా కలెక్టర్ ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. వ్యవసాయాధారిత జీవనం సాగించే తెలుగు రాష్ట్రాలలో సంక్రాంతి పండుగకు ప్రత్యేకత ఉందని, కొత్త పంటలు చేతికందిన రైతులు, ఇంటినిండా ధాన్య సిరుల సంపదల మధ్య ఆనందంగా జరుపుకునే పండుగే ఈ సంక్రాంతి అన్నారు. సనాతన సంప్రదాయాలను గుర్తుకు తెచ్చి, అల్లుళ్ళు, బంధుమిత్రులతో సరదాగా చేసుకునే పండుగే సంక్రాంతి అన్నారు. ఈ ఏడాది ప్రకృతి అన్నివిధాలా కరుణించి.. జిల్లాలో సమృద్ధిగా వర్షాలు కురిసి.. సిరుల పంటలు పండాలన్నారు. ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని, అందరి భాగస్వామ్యంతో అభివృద్ధిలో జిల్లా ముందడుగు వేయాలని ఈ సందర్భంగా వారు అభిలషించారు.

# భారత రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరి పైన ఉంది






**-పాశం యాదగిరి. సీనియర్ జర్నలిస్ట్**

**ఖమ్మం పెన్ పవర్ జనవరి 12:** స్వేచ్ఛ సమానత్వం సౌభ్రాతృత్వం ముఖ్యమైన అంశాలుగా భారత రాజ్యాంగం ఏర్పడిందని దాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత భారతీయ పౌరులమైన మన అందరి మీద ఉందని ప్రముఖ పాత్రికేయులు, సామాజిక ఉద్యమకారులు పాశం యాదగిరి అన్నారు. స్థానిక పీజీ కళాశాల నందు తెలంగాణ చైతన్య వేదిక ఆధ్వర్యంలో జరిగిన "75 వసంతాల భారత రాజ్యాంగం స్వేచ్ఛ సమానత్వం సవాళ్లు" అనే అంశంపై జరిగిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై రాజ్యాంగానికి ముప్పు వాటిల్లినప్పుడల్లా మేధావులు గళం విప్పాలని,సమాజానికి మేధావులు దిక్సూచిగా ఉండాలని, ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని రాజ్యాంగ నిర్మించడం కోసం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చేసిన శ్రమను మరిచిపోకూడదని రాజకీయ వ్యవస్థలు రాజ్యాంగాన్ని తమకు అనుకూలంగా మార్చే ప్రయత్నాల్ని అడ్డుకోవాలని ఓటు మనకు రాజ్యాంగం కల్పించిన హక్కుని దాని ద్వారా ప్రజల నుదిటి రాతలను మార్చవచ్చని కానీ వ్యాపార వర్గాలు రాజకీయ రంగంలో చేరడం వల్ల చివరికి రాజకీయం వ్యాపారంగా మారిందని కేవలం ధనవంతులు మాత్రమే పోటీ చేయడానికి అర్హులుఅన్న విధంగా మారిందని. అర్హులు చట్టసభల్లో అడిగిడితే సమాజానికి మేలు జరుగుతుందని రాజ్యాంగం పట్ల, ఎన్నికల పట్ల,సమాజం పట్ల, ప్రజలను చైతన్య పరచవలసిన బాధ్యత నేటి యువతరం పైన ఎంతైనా ఉందని ఆయన అన్నారు.స్త్రీ సమానత్వం కోసం రాజ్యాంగంలో ఎన్నో అంశాలు పొందుపరిచారని వాటిని అమలు పరచాల్సినటువంటి బాధ్యత నేటి ప్రభుత్వాలపైన ఉందని ఆయన తెలిపారు.

ఈ సదస్సుకు తెలంగాణ చైతన్య వేదిక కన్వీనర్ ములక సురేష్ అధ్యక్షత వహించగా కాకతీయ యూనివర్సిటీ విశ్రాంత అధ్యాపకులు కూరపాటి వెంకట నారాయణ తెలంగాణ వికాస సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏరోజు శ్రీనివాస్,స్థానిక మహిళా కళాశాల అధ్యాపకురాలు విజయలక్ష్మి,వీరనారి మహిళా సంఘ అధ్యక్షులు ఉపేంద్ర , బిసి ఇంటలెక్చువల్ ఫోరం కన్వీనర్ డాక్టర్ వీరస్వామి,సామాజిక ఉద్యమకారులు గుంతేటి వీరభద్రం, గోపగాని శంకర్రావు, విజయకుమారి, చెరుకుపల్లి నాగేశ్వరరావు, పగిడిపల్లి వెంకటేశ్వర్లు, శోభన్,జల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# రిటైనింగ్ వాల్ నిర్మాణం, భూసేకరణ,పనుల వేగవంతం చేయాలి: మంత్రి పొంగులేటి






**ఖమ్మం, పెన్ పవర్ జనవరి12:** మున్నేరు నది ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మించేందుకు అవసరమైన భూమి సేకరణకు ప్రాధాన్యతనిచ్చి త్వరితగతిన పూర్తి చేయాలని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఖమ్మంలోని తన క్యాంప్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ .పి. శ్రీజ , సంబంధిత రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణ, భూసేకరణ పనుల పురోగతిపై సమీక్షించారు.రిటైనింగ్ వాల్ నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ వివరాలను, నిర్మాణ పురోగతిని అధికారులు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... మున్నేరు నదీ తీరం వెంబడి రూ.690 కోట్లతో 17 కిలోమీటర్ల ఆర్సిసి రిటైనింగ్ వాల్ నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయించిందని, రెండు వైపులా గోడ నిర్మాణానికి ప్రస్తుత అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూమి నందు 5.1 కిలో మీటర్లు రూరల్ మండలం వైపు, 1.7 కిలో మీటర్ల ఖమ్మం అర్బన్ వైపు నిర్మించవచ్చని అన్నారు. రిటైనింగ్ వాల్ నిర్మాణం , భూ సేకరణపై పురోగతి వివరాలను ప్రతి రోజూ తెలియజేయాలని అన్నారు. మున్నేరు నది వద్ద క్లియర్ గా ఉన్న 8 కిలో మీటర్ల మేర ట్యాగింగ్ చేయాలని, ఫీల్డ్ లో పెద్ద ఎత్తున అదనపు బృందాలను ఏర్పాటు చేసి పనులు ముమ్మరంగా జరిగేలా చూడాలని అన్నారు. రిటైనింగ్ వాల్ నిర్మాణానికి సంబంధించి సేకరించాల్సిన ప్రైవేట్ భూముల యజమానులతో చర్చించి సదరు భూములను వెంటనే స్వాధీనం చేసుకునే దిశగా తహసిల్దార్ చర్యలు తీసుకోవాలని అన్నారు. జనవరి 15 నుంచి భూ సేకరణ పురోగతిని ప్రతి రోజూ పర్యవేక్షిస్తానని మంత్రి అన్నారు.రిటైనింగ్ వాల్ నిర్మాణానికి సంబంధించి పురోగతి పట్ల మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. జూలై 15 నాటికి రిటైనింగ్ వాల్ నిర్మాణం పూర్తి చేసేందుకు రోజువారి పనుల పురోగతితో షెడ్యూల్ రూపొందించి జనవరి 16 నాటికి సమర్పించాలన్నారు. ప్రభుత్వ భూములలో రిటైనింగ్ వాల్ నిర్మాణం జరిగే లోపు భూసేకరణ ప్రక్రియ పూర్తి అయ్యేలా ప్రాధాన్యతతో రెవెన్యూ అధికారులు పని చేయాలని అన్నారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ ఎస్ఇ వెంకటేశ్వరరావు, ఇఇ అనన్య, ఆర్డీఓ నరసింహారావు, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, ఖమ్మం అర్బన్, రూరల్ తహసీల్దార్లు రవికుమార్, రాంప్రసాద్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ,అటవీ భూముల సరిహద్దు వివాదాల పరిష్కారానికి కృషి

రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

ప్రభుత్వ భూములలో మైనింగ్ పట్ల నివేదిక అందించాలి

నూతన చట్టానికి రూపొందించే రూల్స్ పై సలహాలు అందించాలి



**ఖమ్మం పెన్ పవర్ జనవరి 12:** రెవెన్యూ,అటవీ భూ వివాదాల పరిష్కారానికి కార్యాచరణ చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తన నివాసంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి,జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా.పి. శ్రీజ,రెవెన్యూ,అటవీ శాఖల అధికారులతో రెవెన్యూ , అటవీభూములలో ఉన్న సమస్యల పరిష్కారం, రెవెన్యూ ప్రైవేట్ వ్యక్తుల మధ్య ఉన్న భూ వివాదాల పై సమీక్షించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రభుత్వం పంపిణీ చేసిన అసైన్మెంట్ పట్టాలలో గత 40 సంవత్సరాలుగా క్షేత్ర స్థాయిలో రైతులు సాగు చేస్తున్నారని,రైతులకు ఉన్న భూ సమస్యలు రెవెన్యూ,అటవీ అధికారులు సమన్వయంతో పని చేసి పరిష్కరించాలని అన్నారు. భూముల సర్వే కోసం అవసరమైతే అధునాతన సామాగ్రిని సైతం అందుబాటులోకి తెస్తామని మంత్రి అన్నారు.జిల్లాలోని ప్రతి నియోజక వర్గంలో ఒక గ్రామాన్ని ముందస్తుగా పైలెట్ క్రింద ఎంపిక చేసుకుని అక్కడ రెవెన్యూ,అటవీ సమస్యల భూ వివాదాల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని మంత్రి అన్నారు.అటవీ భూములకు సంబంధించి సరిహద్దు వద్ద అధునాతన పరికరాలతో సర్వే చేపట్టి పక్కాగా నమోదు చేయాలని అన్నారు. జిల్లాలో 15 సర్వే నెంబర్ లలో 1500 ఎకరాలు రెవెన్యూ, అటవీ భూముల బౌండరీ సమస్య ఉందని, దీనిని సర్వే ద్వారా పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని అన్నారు.జిల్లాలో ముందుగా ఒకే దగ్గర ఉన్న సర్వే నెంబర్ లలో సర్వే చేయాలని అన్నారు. విదేశాలలో ఉన్న వ్యక్తులు కూడా తమకు భూమి ఉందని చెబుతున్నారని, అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి భూములు ఎవరి దగ్గర ఉన్నాయి వంటి వివరాలను పక్కాగా సేకరించాలని అన్నారు. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ భూముల ఆక్రమణలపై నివేదిక అందించాలని అన్నారు. జిల్లాలో మైనింగ్ క్వారి కోసం రెవెన్యూ భూములు ఎక్కడ కేటాయించారు, ప్రభుత్వానికి వస్తున్న ఆదాయం వంటి అంశాలపై నివేదిక పరిశీలించాలని మంత్రి జిల్లా కలెక్టర్ కు సూచించారు. అధికారికంగా ఇచ్చిన మైనింగ్ అనుమతుల కంటే క్షేత్ర స్థాయిలో అదనంగా అక్రమంగా నడుస్తున్నాయని,వీటిని పరిశీలించి చర్యలు తీసుకోవాలని,క్వారీల ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయం నష్టపరిచే వారిపై చర్యలు తీసుకోవాలని మంత్రి అన్నారు. ఖమ్మం రూరల్ మండలంలో లీజు సమయం ముగిసిన ప్రభుత్వ భూములలో మైనింగ్ క్వారీలు మూసివేసి పనికి వచ్చే భూముల వివరాలతో కలెక్టర్ కు నివేదిక అందించాలని, అక్కడ పేదలకు ఇండ్ల నిర్మాణం లేదా సదరు భూములను ప్రభుత్వానికి ఆదాయం వచ్చే విధంగా ప్రణాళికలను రూపొందిస్తామని తెలిపారు. నూతన రెవెన్యూ చట్టానికి సంబంధించి నిబంధనలను సిద్ధం చేస్తున్నామని, క్షేత్రస్థాయిలో భూ సమస్యల పరిష్కారానికి ఉపయోగంగా ఉండే విధంగా రూల్స్ ఏర్పాటు గురించి అధికారులు తమ సలహాలను అందజేయాలని తెలిపారు.

సమీక్ష లో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ జిల్లాలో దాదాపు లక్షన్నర ఎకరాల అటవీ భూమి ఉందని, వీటిలో కొన్ని సర్వేల్లో సమస్యలు ఉన్నాయని తెలుపుతూ ప్రాంతాలవారీగా,సర్వే వారీగా ఉన్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొని వచ్చారు.రెవెన్యూ, అటవీ అధికారులు సమన్వయంతో సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ అన్నారు.ఈ సమావేశంలోజిల్లా అటవీ అధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్,ఆర్డీవో లు, నరసింహారావు, రాజేందర్,పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్,అర్బన్, రూరల్ తహసీల్దార్లు రవికుమార్,రాంప్రసాద్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి రద్దు..

**జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.**

సోమవారం భోగి పండుగ సందర్భంగా ప్రభుత్వ సెలవు అయినందున ఐ డి ఓ సి కార్యాలయంలో జరుగు ప్రజావాణి రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆదివారం ఒక ప్రకట నలో తెలిపారు. భోగి పండుగ సెలవు కాబట్టి అధికారులు, సిబ్బంది అందుబాటు లో ఉండని కారణంగా ప్రజలు ఇట్టి విషయాన్ని గమనించి ఐ డి ఓ సి కార్యాలయం కు రావద్దని ఆయన తెలిపారు.



పెన్ పవర్
వరంగల్
వరంగల్ అర్బన్ । వరంగల్ రూరల్

## సంక్రాతి పండుగకి ఉరికెళ్తున్నారా... తస్మాత్ జాగ్రత్త పోలీస్ వారి సూచనలు పాటించండి...



**హైదరాబాద్ పెన్ పవర్:** :భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం లోని ప్రజలు సంక్రాంతి పండగ సెలవులను పురస్కరించుకొని సొంత ప్రాంతాలకు బంధువుల వాళ్ల పిల్లకి ప్రయాణానికి వెళ్ళేట

ప్పుడు సోషల్ మీడియాలో మీ లొకేషన్, ట్రావెల్స్ ప్లాన్స్, ఎప్పుడు ఎక్కడికి వెళ్తున్నాం అనే మీ అప్డేట్స్ పెట్టకండి...

స్వీయ రక్షణ కు ఇంట్లో సీసీ కెమెరా అమర్చుకోవటం మంచిది...

ఎవరైనా అనుమానస్పద వ్యక్తులు కనిపించినట్లయితే వెంటనే స్థానిక పోలీసులకి, డయాల్ 100 కి సమాచారం అందించాలి...

బూర్గంపాడు పోలీసు వారి హెచ్చరిక...

ఉన్నత అధికారుల ఆదేశాలు మేరకు బూర్గంపాడు ఎస్ఐ రాజేష్...

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండలం లోని ప్రజలు

సంక్రాతి పండుగ సెలవులను పురస్కరించుకొని సొంత ప్రాంతాలకు, బంధువుల ఇండ్లకి, విహార యాత్రలకు వెళ్లే ఆయా గ్రామాల,కాలనీల ఆపార్టుమెంట్ వాసులు దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రాజేష్ ఓ ప్రకటనలో తెలిపారు.

చోరీల నియంత్రణకు అన్ని చర్యలు చేపట్టామన్నారు. ఈ సమయం లో బూర్గంపహాడ్ పరిధిలోనీ ప్రజలు పోలీస్ శాఖ వారి సూచనలు పాటిస్తూ సహకరించగలరు అని తెలిపారు.

బూర్గంపహాడ్ ప్రజలకు పోలీసుల సూచనలు:

ఊరికి వెళ్లాల్సి వస్తే విలువైన బంగారు, వెండి, ఆభరణాలు, డబ్బులు, బ్యాంక్ లాకర్లలో భద్రపర్చుకోండి. లేదంటే మీ ఇంట్లోనే రహస్య ప్రదేశంలో దాచుకోండి. బీరువా తాళాలను ఇంట్లో ఉంచరాదు తమతో పాటే తీసుకెళ్లాలి.

సెలవుల్లో బయటికి వెళుతున్నప్పుడు మీ ఇంటికి సెంట్రల్ లాక్ సిస్టమ్ ఉండే తాళం, సెక్యూరిటీ అలారం, మోషన్ సెన్సర్ను ఏర్పాటు చేసుకోండం మంచిది.

తాళం వేసి ఊరికి వెళ్లాల్సి వస్తే తప్పనిసరి స్థానిక పోలీస్టేషన్ లో సమాచారం ఇవ్వండి. వారి వివరాలు నమోదు చేసుకొని వారి ఇళ్లపై నిఘా ఏర్పాటు చేస్తాం.

మీ వాహనాలను ఇంటి ఆవరణలోనే పార్కు చేసుకోండి. ద్విచక్ర వాహనాలకు తప్పనిసరిగా చైన్స్ తో లాక్ వెయ్యడం మంచిది.

నమ్మకమైన వ్యక్తులను మాత్రమే వాచ్ మెన్/ సెక్యూరిటీ గార్డ్/ సర్వెంట్ గా నియమించుకోవాలి.

మీ ఇంట్లో స్వీయ రక్షణ సీసీ కెమెరాలను అమర్చుకోవాలి. ఆన్ లైన్లో ఎప్పటికప్పుడు మొబైల్ లో మీ ఇంటిని, పరిసరాలను లైవ్/ ప్రత్యేక్షంగా చూసుకొవచ్చు. సెక్యూరిటీ సర్వేలైన్స్ కు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయి.

ఊరు వెళ్తున్నప్పుడు పక్కింటి వారికి ఇంటి పరిసరాలను గమనించాలని చెప్పాలి. ఇంటికి తాళం వేసిన తర్వాత తాళం కనబడకుండా డోర్ కట్టిన వేయాలి. ఇంట్లో ఏదో ఒక గదిలో లైట్ వేసి ఉంచాలి.

ఇంట్లో లేనప్పుడు పని మనుషులు ఉంటే రోజు వాకిలి ఊడ్చమని చెప్పాలి. ఇంటి ముందు చెత్త చెదారం, న్యూస్ పేపర్స్, పాలప్యాకెట్లు జమ కానివ్వకుండా చూడండి. వాటిని కూడా గమనించి నేరస్థులు దొంగతనాలకు పాల్పడే అవకాశం ఉన్నది.

ఈ పండుగకి దూర ప్రాంతాల నుంచి బంధువులు స్నేహితులు అందరూ వచ్చేవారు ,సరదా కోసం ఇక్కడ గోదావరి నది చెరువులో ,బావులు,కుంటలు ఎంత లోతు ఉంటాయో తెలియదు ఈత కొట్టడానికి వెళుతూ ఉంటారు .వారిని జాగ్రత్తగా స్థానికంగా ఉండేవారే వారికి ఇక్కడ పరిస్థితులు వివరించాలి. లేని పక్షంలో జరగరానిది ఏదైనా జరిగితే పండుగ దినాలలో విషాదాలు చోటు చేసుకునే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ప్రజలందరూ గమనించగలరు.

మీ గ్రామం, పట్టణం, కాలనీలో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే స్థానిక పోలీసు స్టేషన్ కు తప్పనిసరిగా సమాచారం ఇవ్వండి. డయల్ 100కు కాల్ చేయండి. ప్రజలు పోలీస్ శాఖ వారి సూచనలు పాటిస్తూ సహకరిస్తే చోరీల నియంత్రించడం సులభం అవుతుంది. ఎస్ఐ రాజేష్ తెలిపారు..

## నేడు భద్రాచలం ఐటీడీఏ గిరిజన దర్బార్ రద్దు.

**1ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్.**

**హైదరాబాద్ పెన్ పవర్:** సో మవారం భోగి పండుగ సందర్భంగా ప్రభుత్వ సెలవు అయినందున ఐటీడీఏ లోని గిరిజన దర్బార్ రద్దు చేసినట్లు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భోగి పండుగ సెలవు కాబట్టి ఐటీడీఏ కార్యాలయం లోని యూనిట్ అధికారులు, సిబ్బంది అందుబాటు లో ఉండని కారణంగా ఆదివాసి గిరిజన ప్రజలు ఇట్టి విషయాన్ని గమనించి ఐటీడీఏ కార్యాలయం కు రావద్దని ఆయన తెలిపారు.

## మహిళలు అన్నీ రంగాలలో మరింత అభివృద్ధి చెందాలి.....!




**హైదరాబాద్ పెన్ పవర్:** మహిళలు అన్ని రంగాలలో మరింత అభివృద్ధి చెందాలని డాక్టర్ దుర్గ భవాని, డాక్టర్ పి అనూష, డాక్టర్ ఎం. సింధుజ అన్నారు. బండారు తులసి స్మారక సంక్రాంతి ముగ్గుల పోటీల సందర్భంగా బహుమతి ప్రధానోత్సవ సభలో వారు మాట్లాడుతూ దేశంలో మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి సాధించినప్పుడే దేశము అభివృద్ధి చెందుతుందని అన్నారు. ప్రపంచంలోనే తెలుగు సంస్కృతి సాంప్రదాయాల కు ఎంతో విలువందని పేరు ఉందని అన్నారు. ముగ్గుల పోటీల సందర్భంగా మహిళలు అందరూ ఎంతో పోటీపడి ముగ్గులు వేశారని కార్యక్రమం లో పాల్గొని ముగ్గులు వేసిన వారందరికీ విజేతలకు వారు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లైన్ లేడీ ఎం సీతా రత్నం, లైన్స్ క్లబ్ అధ్యక్షులు సిహెచ్ రామలింగేశ్వర రావు, ముగ్గుల పోటీలకు జడ్జిలుగా కే లక్ష్మి, అపర్ణ, పి సునీత వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో బండారు శరత్ బాబు, గడ్డం స్వామి, ఐద్వా నాయకులు డి లక్ష్మి, ఎన్ లీలావతి, జి నాగలక్ష్మి వార్డు అభివృద్ధి కమిటీ సభ్యులు మరియు బండారు సరస్వతి జీ పద్మావతి సి.హెచ్ విశాలాక్షి సి.హెచ్ మంజుల, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. మొదటి బహుమతి డి అక్షయ రెండవ బహుమతి కే దుర్గా మూడవ బహుమతి పి. తేజస్విని గెలుచుకున్నారు. పోటీల్లో పాల్గొని ముగ్గులు వేసిన పదిమందికి కన్సోలేషన్ బహుమతులు పోటీలో పాల్గొన్న మహిళలందరికీ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమం లో ఎస్ డి ఫిరోజ్, జీనుగు నాగేందర్ రావు, రవి, రషీద్, పీవీ వి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

## పెద్దమ్మతల్లిని అధిక సంఖ్యలో దర్శించుకున్న భక్తులు.

**హైదరాబాద్ పెన్ పవర్:** పాల్వంచ మండలం, కేశవాపురం- జగన్నాధపురం గ్రామంలో వెలసియున్న శ్రీ కనకదుర్గ దేవస్థానము (పెద్దమ్మగుడి) ఆదివారం సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేయడం తో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుండే పరిసర గ్రామాల నుండే కాక జిల్లా నలుమూలల నుండేకాక ఇతర జిల్లాల నుండి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసినారు. తమను చల్లంగా చూడాలని వేడుకుంటూ బోనాలు సమర్పించినారు. మరియు అన్నప్రాశనలు, వాహనపూజలు, తలనీలాలు, అమ్మవారికి ఒడిబియ్యం, చీరలు, కనుములు, తదితర మొక్కులను చెల్లించుకొని అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదములను స్వీకరించారు. భక్తులకు అవసరమైన ప్రత్యేక దర్శనమునకు క్యూలైన్లు, ఉచిత పులిహోర ప్రసాద వితరణ, మంచినీటి వసతి తదితర ఏర్పాట్లను దేవస్థాన కార్యనిర్వహణాధికారి శ్రీమతి ఎన్. రజనీ కుమారి ఆదేశాల మేరకు సిబ్బంది పర్యవేక్షించినారు.



ఈ నెల 13 న దేవాలయంలో చండీహోమం

శ్రీ కనకదుర్గ దేవస్థానము (పెద్దమ్మగుడి) నందు పౌర్ణమిరోజున నిర్వహించే "చండీహోమం" సోమవారం రోజున జరుపబడును. ఈ చండీహోమం జరిపించుకున్న భక్తులకు అమ్మవారు ఆయురారోగ్య, అష్టైశ్వర్యములు కలుగచేయును. ఆర్థిక బాధలు తొలగి, సుఖసంతోషాలతో వర్ధిల్లుతారని వేదాలు చెబుతున్నాయి. ఈ చండీహోమంలో పాల్గొను భక్తులు ముందుగా కాని అదేరోజు గాని రూ.2516.00 చెల్లించి టికెట్ పొంది, మీ గోత్రనామములు నమోదు చేసుకోవలెను. చండీహోమం లో పాల్గొన్న దంపతులకు శేషవస్త్ర ప్రసాదములతో పాటు ఉచిత అన్నప్రసాదం ఏర్పాటు చేయబడును. ప్రత్యక్షంగా పాల్గొనే అవకాశం లేనివారి పేర సంకల్పం చేసి హోమం చేయబడును. హోమంలో పాల్గొను భక్తులు సాంప్రదాయ దుస్తులు అనగా మగవారు ధోతి, కండువాను ధరించి, ఆడవారు చీర ధరించవలెను. పూర్తి వివరములకు ఫోన్ నెం. 6303408458 ల వారిని సంప్రదించగలరు అని తెలిపారు.

## కాంగ్రెస్ మండల అధ్యక్షునీ పాడే మోసిన దుబ్బాక కాంగ్రెస్ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి





**హైదరాబాద్ పెన్ పవర్:** నార్సింగ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆకుల శ్రీనివాస్ గౌడ్ నిన్న హఠాత్తుగా మరణించారు వారి పై దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ జెండాను కప్పి అంతిమ యాత్ర లో పాల్గొని అమర్ హే ఆకుల శ్రీనివాస్ అమర్ హే అమర్ హే నినాదాలతో యాత్రను ప్రారంభించారు ఆయన మాట్లాడుతూ ఒక సోదరుడిగా 40 సంవత్సరాలు నాకు ఏళ్ల వేళలా తోడుగా ఉండి నార్సింగ్ మండలంకి ఒక సుపరిచుడిని కోల్పోవడం మా పార్టీకి నార్సింగ్ ప్రజలకు తీరని లోటు వారి కుటుంబానికి ఎప్పుడు తోడుగా ఉంటామని చెప్పడం జరిగింది.. ఈ కార్యక్రమంలో అన్ని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బ్లాక్ అద్యక్షులు అన్ని మండల కాంగ్రెస్ పార్టీ కమిటీ సభ్యులు యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సీనియర్ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు

## మహిళపై గుర్తుతెలియ దండలు దాడి






**హైదరాబాద్ పెన్ పవర్:** ౨మతిస్థిమితం లేని మహిళపై.గ్యాంగ్ రేప్ మెదక్ జిల్లా మసాయి పేట మండలం రామంతాపూర్ లో దారుణంఐదు రోజుల తరువాత ఆలస్యంగావెలుగులోకి మెదక్ జిల్లా రామంతపూర్ గ్రామనికి చెందిన స్వామి తన బర్రె కనపడకుండా పోయిందని 10 వ తేదినాడు పోలీస్ లకు పిర్యాదు చేసాడు, పిర్యాదు మేరకు పోలీస్ లు విచారించగా రామంతపూర్ స్టేజి వద్ద గల హంస దాబా కు చెందిన సీసీటీవీ ఫుటేజ్ పోలీసులు చూస్తుండగా అత్యాచారం వెలుగులోకి వచ్చింది, వీరు తూప్రాన్ కు చెందిన సయ్యద్ అఫ్రోజ్, సోహెల్ బీహార్ రాష్ట్రా%శీ% చెగుంట లో హెల్పర్ పనిచేసుతున్నాడు గౌరీ బస్వ రాజ్, గా పోలీసులు గుర్తించారు మతి స్థిమితం లేని మహిళ తన యొక్క వివరాలు చెప్పలేకపోతుంది, ప్రస్తుతం మతిస్థిమితం లేని మహిళను భరోసా సెంటర్ కు తరలించిన పోలిసులు

## వివేకానందుని జీవితం ఆదర్శప్రాయం.

**హైదరాబాద్ పెన్ పవర్:** భారతదేశ ఔన్నత్యాన్ని దశ దిశల చాటిచెప్పిన స్వామి వివేకానంద ప్రతి ఒక్క భారతీయునికి ఆదర్శప్రాయుడని గౌతమి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆకుల కొండలరావు అన్నారు. శనివారం వివేకానంద జయంతి సందర్భంగా వనవాసి కళ్యాణ పరిషత్ కొమరం భీమ్ విద్యార్థి నిలయం లోని వివేకానందుని విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొప్పతత్వవేత్తలు, ఆధ్యాత్మిక నాయకులలో ఒకరైన వివేకానందుని స్మరించుకోవడం ఆనందదాయకం అన్నారు. రామకృష్ణ పరమహంస శిష్యునిగా వేదాంత యోగతత్వ శాస్త్రములతో సమాజంపై అత్యంత ప్రభావం కలిగిన ఒక ప్రత్యేక ఆధ్యాత్మిక నాయకుడు వివేకానందుడు అని పేర్కొన్నారు. దేశాన్ని జాగృతం చేయడమే కాకుండా అమెరికా ఇంగ్లాండ్ లలో యోగ వేద శాస్త్రములను తన ఉపన్యాసములు, వాదనల ద్వారా పరిచయం చేసి భారతదేశ గొప్పతనాన్ని విదేశాలలో చాటిన మహనీయులన్నారు. ఆయన వాగ్దాటికి మంత్ర ముగ్ధులైన అమెరికా ప్రజానీకం బ్రహ్మానందం పట్టిన విషయాన్ని గుర్తు చేశారు. పాశ్చ్యాత్య దేశాలలోకి అడుగుపెట్టిన మొట్టమొదటి హిందూ సన్యాసి అయిన వివేకానందుడు చేసిన ప్రసంగాలు భారతదేశంలో పాటు ఇతర దేశాలను సైతం ఉర్రూతలూగించాయని పేర్కొన్నారు. దేశంలో రామకృష్ణ మఠాన్ని స్థాపించి యువతకు దిశా నిర్దేశం చేశారన్నారు. 39 సంవత్సరాల వయసులోనే వివేకానందుడు పరమపదించటం బాధాకరమన్నారు. ఆయన జన్మదినం సందర్భంగా ప్రతి ఏటా జనవరి 12వ తేదీన జాతీయ యువజన దినోత్సవం జరుపుకోవడం ఆనందదాయకమన్నారు. ఈ సందర్భంగా వాణి విద్యాని కేతన్ లో ఏడవ తరగతి చదువుతున్న ఆకుల లిఖిల స్వామీ వివేకానందుని పై చేసిన ప్రసంగం ఆకట్టుకున్నది. కార్యక్రమంలో వనవాసీ కళ్యాణ పరిషత్ ప్రాంత మహిళా సహ ప్రముఖ్ పెద్దాడ ఆశాలత, ప్రఖండ ప్రముఖ్ గొంది శోభన్ బాబు, నిలయ కమిటీ సభ్యులు మల్లాది సుబ్రమణ్యం, నిలయ ప్రముఖ్ గొంది ప్రసన్న కుమారి, భద్రాద్రి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అశోక్, సాగర్, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఫాతిమా నగర్ లో క్రికెట్ కప్పు గెలుచుకున్న ధర్మసాగర్ క్రికెట్ టీం

**కెప్టెన్ పుట్ట ప్రశాంత్**

హైదరాబాద్ పెన్ పవర్:

ఫాతిమా లో జన్ను థామస్ 2వ వర్ధంతి సందర్భంగా జన్ను ఇవన్స్ జన్ను మార్టిన్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ జరిగింది, ఇందులో భాగంగా ఫాతిమానగర్ క్రికెట్ టీం ధర్మసాగర్ క్రికెట్ టీం తో తలపడగా బ్యాటింగ్ లో ధర్మసాగర్ టీం నుండి అరుణ్ 50 పరుగులు రాణించిగా, బౌలింగ్ లో బొడ్డు ప్రభుదేవ్ 4 వికెట్స్ తీసి జట్టు విజయం లో కీలక పాత్ర పోషించినారు. ధర్మసాగర్ కెప్టెన్ పుట్ట ప్రశాంత్ టీమ్ విజయం సాధించడ మైనది.

# భూ వివాదాల పరిష్కారానికి కృషి .....

- రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- రెవెన్యూ, అటవీ భూముల సరిహద్దు వివాదాల పరిష్కారానికి చర్యలు
- ప్రభుత్వ భూములలో మైనింగ్ పట్ల నివేదిక అందించాలి
- నూతన చట్టానికి రూపొందించే రూల్స్ పై సలహాలు అందించాలి
- రెవెన్యూ , అటవీ భూములలో ఉన్న సమస్యల పరిష్కారం, రెవెన్యూ, ప్రైవేట్ వ్యక్తుల మధ్య ఉన్న భూ వివాదాలపై రెవెన్యూ అధికారులతో సమీక్షించిన మంత్రి పొంగులేటి



**హైదరాబాద్ పెన్ పవర్:** రెవెన్యూ, అటవీ భూ వివాదాల పరిష్కారానికి కార్యాచరణ చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.
ఆదివారం మంత్రి, ఖమ్మం శ్రీ శ్రీ సర్కిల్ లోని తన నివాసంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, రెవెన్యూ, అటవీ శాఖ అధికారులతో రెవెన్యూ , అటవీభూములలో ఉన్న సమస్యల పరిష్కారం, రెవెన్యూ ప్రైవేట్ వ్యక్తుల మధ్య ఉన్న భూ వివాదాల పై సమీక్షించారు.
ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రభుత్వం పంపిణీ చేసిన అసైన్మెంట్ పట్టాలలో గత 40 సంవత్సరాలుగా క్షేత్ర స్థాయిలో రైతులు సాగు చేస్తున్నారని, రైతులకు ఉన్న భూ సమస్యలు రెవెన్యూ, అటవీ అధికారులు సమన్వయంతో పని చేసి పరిష్కరించాలని అన్నారు.
భూముల సర్వే కోసం అవసరమైతే అధునాతన సామాగ్రిని సైతం అందుబాటులోకి తెస్తామని మంత్రి అన్నారు. జిల్లాలోని ప్రతి నియోజక వర్గంలో ఒక గ్రామాన్ని ముందస్తుగా పైలెట్ క్రింద ఎంపిక చేసుకుని అక్కడ రెవెన్యూ, అటవీ సమస్యల భూ వివాదాల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని మంత్రి అన్నారు. అటవీ భూములకు సంబంధించి సరిహద్దు వద్ద అధునాతన పరికరాలతో సర్వే చేపట్టి పక్కాగా నమోదు చేయాలని అన్నారు.
జిల్లాలో 15 సర్వే నెంబర్ లలో 1500 ఎకరాలు రెవెన్యూ, అటవీ భూముల బౌండరీ సమస్య ఉందని, దీనిని సర్వే ద్వారా పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో ముందుగా ఒకే దగ్గర ఉన్న సర్వే నెంబర్ లలో సర్వే చేయాలని అన్నారు.
విదేశాలలో ఉన్న వ్యక్తులు కూడా తమకు భూమి ఉందని చెబుతున్నారని, అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి భూములు ఎవరి దగ్గర ఉన్నాయి వంటి వివరాలను పక్కాగా సేకరించాలని అన్నారు. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ భూముల ఆక్రమణలపై నివేదిక అందించాలని అన్నారు.
జిల్లాలో మైనింగ్ క్వారి కోసం రెవెన్యూ భూములు ఎక్కడ కేటాయించారు, ప్రభుత్వానికి వస్తున్న ఆదాయం వంటి అంశాలపై నివేదిక పరిశీలించాలని మంత్రి జిల్లా కలెక్టర్ కు సూచించారు. అధికారికంగా ఇచ్చిన మైనింగ్ అనుమతుల కంటే క్షేత్ర స్థాయిలో అదనంగా అక్రమంగా నడుస్తున్నాయని, వీటిని పరిశీలించి చర్యలు తీసుకోవాలని, క్వారీల ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయం నష్టపరిచే వారిపై చర్యలు తీసుకోవాలని మంత్రి అన్నారు.
ఖమ్మం రూరల్ మండలంలో లీజు సమయం ముగిసిన ప్రభుత్వ భూములలో మైనింగ్ క్వారీలు మూసివేసి పనికి వచ్చే భూముల వివరాలతో కలెక్టర్ కు నివేదిక అందించాలని, అక్కడ పేదలకు ఇండ్ల నిర్మాణం లేదా సదరు భూములను ప్రభుత్వానికి ఆదాయం వచ్చే విధంగా ప్రణాళికలను రూపొందిస్తామని మంత్రి తెలిపారు.
నూతన రెవెన్యూ చట్టానికి సంబంధించి నిబంధనలను సిద్ధం చేస్తున్నామని, క్షేత్రస్థాయిలో భూ సమస్యల పరిష్కారానికి ఉపయోగంగా ఉండే విధంగా రూల్స్ ఏర్పాటు గురించి అధికారులు తమ సలహాలను అందజేయాలని మంత్రి తెలిపారు.
సమీక్షలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, జిల్లాలో దాదాపు లక్షన్నర ఎకరాల అటవీ భూమి ఉందని, వీటిలో కొన్ని సర్వేల్లో సమస్యలు ఉన్నాయని తెలుపుతూ ప్రాంతాలవారీగా, సర్వే వారీగా ఉన్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొని వచ్చారు. రెవెన్యూ, అటవీ అధికారులు సమన్వయంతో సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ అన్నారు.
ఈ సమావేశంలో జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, ఆర్డీవో లు, నరసింహారావు, రాజేందర్, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, అర్బన్, రూరల్ తహసీల్దార్లు రవికుమార్, రాంప్రసాద్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం మున్సిపాలిటీ పరిధిలో పేదలకు వర్తింపచేయాలి ....

- పేదలందరికీ 12 వేల రూపాయలు ఇవ్వాలి ....
- మున్సిపాలిటీ పరిధిలో పేదలకు జాబ్ కార్డ్ అందరికీ ఇవ్వాలి
- రాష్ట్ర ప్రభుత్వానికి సిపిఐ(ఎం) డిమాండ్




**హైదరాబాద్ పెన్ పవర్:** :మున్సిపాలిటీ పరిధిలో ఉన్న పేదలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలో పేదలకు వర్తించే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద సంవత్సరానికి 12 వేల రూపాయలు వర్తింపచేయాలని సిపిఐ(ఎం) వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, సిపిఐ (ఎం) జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్ సిపిఐ (ఎం) వైరా పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వైరా మున్సిపాలిటీలో దాదాపు నాలుగు వేల కుటుంబాలు పేదరికంలో ఉన్నారని, రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం వర్తించే అవకాశం లేకుండా ఉందని దీనివల్ల తీవ్ర అన్యాయం జరిగే అవకాశం ఉందిని వారు ఆందోళన వ్యక్తం చేశారు. వైరా మున్సిపాలిటీ మొత్తం కూడా వ్యవసాయ ఆధారిత ప్రాంతం గ్రామీణ ప్రాంతాలతో కూడుకొని ఉందని గ్రామీణ మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటికే పేదలకు ఉపాధి హామీ కోల్పోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు పేదలందరికీ సంవత్సరానికి 12 వేల రూపాయలు అందిస్తామని హామీ ఇచ్చి అమలకు వచ్చేసరికి మున్సిపాలిటీ పరిధిలో పేదలకు వర్తించకుండా నిర్ణయం చేయటం సరైనది కాదని ఆదివారం వైరా సిపిఎం కార్యాలయంలో నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో వారు తెలిపారు . ప్రభుత్వం తన ఆలోచనని మార్చుకొని మునిసిపాలిటీ పరిధిలో పేదలకు కూడా 12 వేల రూపాయల ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం వర్తించే విధంగా చర్యలు చేపట్టాలని, అదేవిధంగా కేంద్ర ప్రభుత్వంతో సంప్రదించి, మున్సిపాలిటీ పరిధిలో ఉపాధి హామీ పనులు పేదలకు కల్పించే విధంగా ప్రజలందరికీ ఉపాధి హామీ జాబ్ కార్డులు ఇప్పించేందుకు చొరవ చూపాలని, లేనిపక్షంలో సిపిఐ(ఎం) ఆధ్వర్యంలో పేదలను సమీకరించి ఆందోళన పోరాటాలకు సిద్ధమవుతామని వారు తెలిపారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం సాధించడం కోసం పేదలంతా కలిసికట్టుగా పోరాటాలకు సిద్ధం కావాలని వారు కోరారు.

# నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో డేర్ కళాశాలలో స్వామి వివేకానందా 162 వ పుట్టినరోజు దినోత్సవం




**హైదరాబాద్ పెన్ పవర్:** :నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో జిల్లా యువ అధికారి భూక్య ప్రవీణ్ సింగ్ ఆదేశాల మేరకు, కమరతపు భానుచందర్ ప్రోత్సాహంతో, %ణతీ. ఞ%. కిరణ్ కుమార్ సహకారంతో ఖమ్మం జిల్లా రూరల్ మండలం నందుగల దరిపల్లి అనంతరాములు ఇంజనీరింగ్ కళాశాలలో స్వామి వివేకానంద 162 వ పుట్టినరోజు దినోత్సవాన్ని నిర్వహించడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో భాగంగా ముందుగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలవేయడం ఆ తరువాత యువతకు ఎస్సే రైటింగ్ నిర్వహించి అందులో ప్రథమ బహుమతి ద్వితీయ బహుమతి అందజేయడం జరిగింది. అలాగే స్వామి వివేకానంద గారి గురించి అవగాహన నిర్వహించారు మరియు ర్యాలీ, మొక్కలు నాటడం అదేవిధంగా కళాశాలలో గల సరస్వతి దేవి విగ్రహం వద్ద పరిశుభ్రం చేయడం ఆయన ఆశయాలను నెరవేరుస్తామని యువత ప్రతిజ్ఞ చేయడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమమునకు సహకరించినందుకు నెహ్రూ యువ కేంద్ర వారు డాక్టర్ డి కిరణ్ కుమార్ కి సన్మానం చేయడం జరిగింది. శిరీష, మౌనిష, సంజన, ప్రసన్న, రవి,నవీన్, త్రివేణి,పవన్ మరియు కళాశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలియజేశారు

## వివేకానందుని బాటలో పయనిద్దాం.

**న్యూ పవర్ కుంగ్ ఫు అకాడమీ ఆధ్వర్యంలో స్వామి వివేకానందుని జయంతి కార్యక్రమం.**



**హైదరాబాద్ పెన్ పవర్:** నేటి యువత,విద్యార్థులు కచ్చితంగా స్వామి వివేకానందుని బాటలో ప్రయాణం చేయాలని కోరారు న్యూ పవర్ కుంగ్ ఫు కోచ్ మాస్టర్ అహ్మద్ ఖాన్..స్వామి వివేకానందుని 162వ జయంతి సందర్భంగా ఫరూక్ నగర్ పట్టణంలో న్యూ పవర్ కుంగ్ ఫు అకాడమీ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలసి వివేకానంద జయంతి ని ఘనంగా నిర్వహించడం జరిగింది.ఇందులో భాగంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు..ఈ కార్యక్రమంలో అహ్మద్ మాస్టర్ తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# రిటైనింగ్ వాల్ నిర్మాణం, భూసేకరణ పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్షించిన మంత్రి పొంగులేటి



**హైదరాబాద్ పెన్ పవర్:** మున్నేరు నది ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మించేందుకు అవసరమైన భూమి సేకరణకు ప్రాధాన్యతనిచ్చి త్వరితగతిన పూర్తి చేయాలని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఖమ్మంలోని తన క్యాంప్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ సంబంధిత రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణ, భూసేకరణ పనుల పురోగతిపై సమీక్షించారు. రిటైనింగ్ వాల్ నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ వివరాలను, నిర్మాణ పురోగతిని అధికారులు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... మున్నేరు నదీ తీరం వెంబడి రూ. 690 కోట్లతో 17 కిలోమీటర్ల ఆర్‌సిసి రిటైనింగ్ వాల్ నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయించిందని, రెండు వైపులా గోడ నిర్మాణానికి ప్రస్తుత అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూమి నందు 5.1 కిలో మీటర్లు రూరల్ మండలం వైపు, 1.7 కిలో మీటర్ల ఖమ్మం అర్బన్ వైపు నిర్మించవచ్చుని అన్నారు. రిటైనింగ్ వాల్ నిర్మాణం , భూ సేకరణపై పురోగతి వివరాలను ప్రతి రోజూ తెలియజేయాలని అన్నారు. మున్నేరు నది వద్ద క్లియర్ గా ఉన్న 8 కిలో మీటర్ల మేర ట్యాగింగ్ చేయాలని, ఫీల్డ్ లో పెద్ద ఎత్తున అదనపు బృందాలను ఏర్పాటు చేసి పనులు ముమ్మరంగా జరిగేలా చూడాలని అన్నారు. రిటైనింగ్ వాల్ నిర్మాణానికి సంబంధించి సేకరించాల్సిన ప్రైవేట్ భూముల యజమానులతో చర్చించి సదరు భూములను వెంటనే స్వాధీనం చేసుకునే దిశగా తహసిల్దార్ చర్యలు తీసుకోవాలని అన్నారు. జనవరి 15 నుంచి భూ సేకరణ పురోగతిని ప్రతి రోజూ పర్యవేక్షిస్తానని మంత్రి అన్నారు. రిటైనింగ్ వాల్ నిర్మాణానికి సంబంధించి పురోగతి పట్ల మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. జూలై 15 నాటికి రిటైనింగ్ వాల్ నిర్మాణం పూర్తి చేసేందుకు రోజువారి పనుల పురోగతితో షెడ్యూల్ రూపొందించి జనవరి 16 నాటికి సమర్పించాలన్నారు. ప్రభుత్వ భూములలో రిటైనింగ్ వాల్ నిర్మాణం జరిగే లోపు భూసేకరణ ప్రక్రియ పూర్తి అయ్యేలా ప్రాధాన్యతతో రెవెన్యూ అధికారులు పని చేయాలని అన్నారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ ఎస్ఇ వెంకటేశ్వరరావు, ఇఇ అనన్య, ఆర్డీఓ నరసింహారావు, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, ఖమ్మం అర్బన్, రూరల్ తహసీల్దార్లు రవికుమార్, రాంప్రసాద్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు.

**కాపు సీతా లక్ష్మి కిరణ్ మెగా ఈవెంట్ ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు.**

**హైదరాబాద్ పెన్ పవర్:** , కొత్తగూడెం రామవరం ఆరవ వార్డు ఓల్డ్ పోస్ట్ ఆఫీస్ గ్రౌండ్ లో ఆదివారం ఘనంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు కొత్తగూడెం మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతా లక్ష్మి కిరణ్ మెగా ఈవెంట్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కొత్తగూడెం మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి టీబీజీకేఎస్ జనరల్ సెక్రెటరీ కాపు కృష్ణ ఎస్ ఆర్ కే టి స్కూల్ మేదర్ బస్తి కొత్తగూడెం డైరెక్టర్ అత్తి రామ్ కొత్తగూడెం మున్సిపాలిటీ 27వ వార్డు కౌన్సిలర్ ప్రసాద్ బాబు వారి సతీమణి భారతి రిపోర్టర్ లక్ష్మణ్, స్టాఫ్ రిపోర్టర్ రత్న కుమార్ తెలంగాణ ఉద్యమకారుడు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో ముందుగా కిరణ్ ఈవెంట్ ఆధ్వర్యంలో ఎంటర్టైన్మెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. సింగర్స్ సౌజన్య శేఖర్ మధురమైన గానాలతో అందరినీ ఆకట్టుకున్నారు యాంకర్ గా శిల్ప ముగ్గుల పోటీలకు వచ్చిన గ్రామస్తులని ఉత్తేజపరచుతూ ప్రోగ్రామ్ విజయవంత చేసే దిశగా వారు యాంకరింగ్ పలువురిని ఆకట్టుకున్నది. జూనియర్ ఎన్టీఆర్ రామ్ చరణ్ బాబాయి బాలకృష్ణ డూప్ ఆర్టిస్టులుగా ఉస్మాన్ సురేష్ లు పలువురిని ఆకట్టుకున్నారు. జడ్జిలుగా 27వ వార్డు కౌన్సిలర్ ప్రసాద్ బాబు వారి సతీమణి స్టాఫ్ నర్స్ భారతి ఉద్యమకారుడు రాజశేఖర్ వ్యవహరించి నారు మొదటి బహుమతిగా గ్రైండర్ ను రెండవ మూడవ బహుమతులుగా మిక్సీలను విజేతలకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులను ఘనంగా శాలువాతో సత్కరించి బోకే అందజేసి షీల్డ్ ను కిరణ్ ఏ టు జెడ్ ఈవెంట్ ఆర్గనైజర్ గండికోట కిరణ్ కుమార్ ముఖ్య అతిథితులకు అందజేశారు ఈ ముగ్గుల పోటీలో పాల్గొన్న పదిమందికి పట్టు చీరలు అందజేశారు. మ్యూజికల్ చైర్ పెద్దవారికి చిన్న వారికి నిర్వహించి గెలుపొందిన వారికి జీవి మాల్ గిఫ్ట్ కూపన్ అందజేశారు. ఈ సందర్భంగా మజా కంపెనీ వారు ఆరుగురు కి గిఫ్ట్ లు అందజేశారు. అనంత ముగ్గుల పోటీలో పాల్గొన్న వారికి తిలకించడానికి వచ్చినవారికి మజా వారు మజా అందజేశారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి కన్సలేషన్ బహుమతులు అందజేశారు.




# కాంగ్రెస్ హయంలో సంక్షేమం అనేది నిరంతర ప్రక్రియ

- మొదటి విడతలో లబ్ది చేకూరని వారికి తరువాత విడతల్లో లబ్ధి
- అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించడమే లక్ష్యం
- ఈ నెల 26నుంచి ప్రతిష్టాత్మకంగా మరో నాలుగు హామీలు అమలు
- అర్హత ఉండి ప్రజాపాలన యాప్ లో నమోదు కానీ దరఖాస్తులు మ్యానువల్ గా నమోదు
- తెలంగాణ రెవెన్యూ , గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- నాలుగు సంక్షేమాల అమలులో అవలంభించాల్సిన విధివిధానాల పై హన్మకొండ ఐడీవోసీలో ఉమ్మడి వరంగల్ జిల్లా అధికారులతో సమావేశం
- హాజరైన మంత్రులు సీతక్క, కొండా సురేఖ, ఇతర ప్రజా ప్రతినిధులు




**హైదరాబాద్ పెన్ పవర్:** కాంగ్రెస్ హయంలో సంక్షేమం అనేది నిరంతర ప్రక్రియ అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. అనివార్య కారణాలరీత్యా మొదటి విడతలో అర్హత ఉండి లబ్ధి చేకూరని వాళ్లకు తరువాత విడతల్లో లబ్ధి చేకూరుతుందనే భరోసా అధికారులు ఇవ్వాలన్నారు. ఈ నెల 26వ తేదీ నుంచి ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ మొదలు కానున్న నేపథ్యంలో హన్మకొండలోని ఐడీవోసీలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఉన్నతాధికారులు, మంత్రులు సీతక్క, కొండా సురేఖ, ఎంపీ పోరిక బలరాం నాయక్, స్థానిక ఎమ్మెల్యేలు, ఇతర కార్పొరేషన్ల చైర్మన్లతో పథకాల అమలులో అవలంభించాల్సిన విధి విధానాల పై ముందస్తు సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్ చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయా జిల్లాల కలెక్టర్లు , అసిస్టెంట్ కలెక్టర్లు, ఇతర శాఖల అధికారులు పథకాల అమలు నేపథ్యంలో అర్హుల ఎంపిక ప్రక్రియలో అవలంభిస్తున్న విధి విధానాలను తొలుత వివరించారు. ఇందులో భాగంగా పలువురు అధికారుల, ప్రజాప్రతినిధుల సందేహాలను మంత్రి పొంగులేటి నివృత్తి చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.... పేదోడి ప్రభుత్వం వచ్చి ఏడాది పూర్తి అయిందని పేర్కొన్నారు. గడిచిన సంవత్సర కాలంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసామని పేర్కొన్నారు. ఇచ్చిన మాట ప్రకారం మరికొన్ని సంక్షేమ పథకాలను పేద ప్రజల దరి చేర్చాలనే సదుద్దేశంతో 75వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని పైన పేర్కొన్న నాలుగు సంక్షేమాలను రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసుకోబోతున్నామని అన్నారు. అర్హత ఉండి రేషన్ కార్డుకు కానీ, ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక ప్రక్రియకు కానీ ఏదైనా కారణాల రీత్యా యాప్ లో నమోదు కాకపోతే వాటిని మ్యానువల్ గా నమోదు చేసుకుని తరువాత విడతల్లో వారికి లబ్ధి చేకూరుతుందనే భరోసా ముందుగానే ఇవ్వాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేకూరాలని సూచించారు. పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ ఉండాలన్నారు. ఆ దిశగా ప్రతి ఒక్క అధికారులు, సిబ్బంది కృషి చేయాలని పేర్కొన్నారు.

## శ్రీవారి హుండీకే కన్నం పెట్టిన ఉద్యోగి



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంటి దొంగను ఈశ్వరుడైనా పట్టుకోలేడనేది సామెత. కానీ, తిరుమల శ్రీవారి ఆలయ విజిలెన్స్ ఇంటి దొంగను పట్టుకుని శభాష్ అనిపించుకున్నారు. శ్రీవారి హుండీలోని 100 గ్రాముల బంగారు బిస్కెట్ ను దొంగిలించిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగి పెంచలయ్యను చాకచక్యంగా పట్టుకుని బంగారాన్ని రికవరీ చేశారు.

తిరుమల శ్రీవారి ఆలయం హుండీ దొంగతనం కలకలం రేపింది. ఆగ్రిగోస్ అనే సంస్థ ద్వారా ఔట్ సోర్సింగ్ విధానంలో ట్రాలీ డ్రైవరుగా పనిచేస్తున్న పెంచలయ్య 100 గ్రాముల బంగారు బిస్కెట్ ను దొంగిలించి అడ్డంగా బుక్కయ్యాడు. శనివారం రాత్రి బంగారు బిస్కెట్ ను దొంగిలించిన పెంచలయ్య ట్రాలీ పైపులో బిస్కెట్ ను దాచాడు. విజిలెన్స్ తనిఖీల్లో పైపులో బంగారు బిస్కెట్ ఉందని పసిగట్టి వెంటనే అదుపులోకి తీసుకుని విచారించారు. ఆదివారం తిరుపతి పోలీసులకు అప్పగించడంతో నిందితుడిని అరెస్టు చేసి దొంగతనం కేసు నమోదు చేశారు. థర్డ్ పార్టీ ద్వారా ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పెంచలయ్య పనిచేస్తున్నాడు. పరకామణి వద్దకు ట్రాలీ ద్వారా హుండీలను తీసుకువెళ్లడం నిందితుడి విధి. శనివారం కూడా పరకామణి విధుల్లో ఉన్న నిందితుడు హుండీలను తీసుకువెళుతుండగా, విజిలెన్స్ తనిఖీ చేసింది. ట్రాలీ పైపులో బంగారు బిస్కెట్ ఉన్నట్లు గుర్తించింది. ఈ సంఘటనతో టీటీడీ అధికారులు ఉలిక్కిపడ్డారు. నిందితుడు ఒక్కటే ఈ నేరానికి పాల్పడ్డాడా? అతడికి ఎవరైనా సహకరించారా? అని పోలీసులు విచారిస్తున్నారు. ఇంతకుముందు ఇలాంటి దొంగతనాలు ఏమైనా చేశాడా? అని ఆరా తీస్తున్నారు. పరకామణి చుట్టుపక్కల చాలా నిఘా ఉంటుంది. సీసీ కెమెరాలతోపాటు విజిలెన్స్ అధికారులు పటిష్టమైన భద్రత చర్యలు తీసుకుంటారు. అలాంటి చోట ఔట్ సోర్సింగ్ ఉద్యోగి చేతివాటంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిందితుడు ఒక్కడే ఇంతటి పని చేయగలడని ఎవరూ నమ్మడం లేదు. అతడికి సహకరించిన వారిని పట్టుకోవాలని శ్రీవారి భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

## గాయపడిన వారిని ఆసుపత్రికి తరలిస్తే కేంద్రం ఇచ్చే ప్రోత్సాహకం తెలుసా?




**హైదరాబాద్ పెన్ పవర్:** రోడ్డు ప్రమాదానికి గురై.. గాయపడిన వారిని గంట వ్యవధిలో ఆసుపత్రికి తరలించే పెద్ద మనసున్న వారికి కేంద్రం ఒక ప్రోత్సాహకాన్ని అమలు చేస్తుంది. నిజానికి ఈ విషయం గురించి చాలామందికి తెలీదు. రోడ్డు మీద ప్రమాదానికి గురై.. తీవ్ర గాయాలైన వారిని అలానే రోడ్డు మీద వదిలేసే వారు.. లేదంటే వీడియోలు.. ఫోటోలు తీసే వారే తప్పించి.. వారికి అప్పుడు అవసరమైన సాయాన్ని అందించేవారు తక్కువ మంది ఉంటారు. కొందరికి అలా చేయాలన్న ఆలోచన ఉన్నప్పటికి.. పోలీసులు.. కేసులు అన్న భయంతో వెనకడుగు వేస్తుంటారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిని గోల్డెన్ అవర్ (ప్రమాదం జరిగిన గంట లోపు) ఆసుపత్రికి తరలిస్తే బతికేందుకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. 108 అంబులెన్స్ సర్వీసు ఉన్నప్పటికీ.. ప్రమాదం జరిగిన వెంటనే దగ్గర్లోని ఆసుపత్రికి తరలిస్తే.. ఆ వ్యక్తి ప్రాణాలు పోకుండా నిలిపే వీలుంది. ఈ నేపథ్యంలో అలా సాయం చేసే పెద్ద మనసున్న వారిని ప్రోత్సహించటంతో పాటు.. అలాంటి వారికి అనవసరమైన కేసులు.. న్యాయపరమైన చిక్కుల్లో చిక్కుకోకుండా ఉండేందుకు మూడేళ్ల క్రితం కేంద్రం ఒక పథకాన్ని తీసుకొచ్చింది. బ్యాడ్ లక్ ఏమంటే.. ఈ పథకంపై పెద్దగా ప్రచారం లేకపోవటంతో.. దీని గురించి ప్రజల్లో అవగాహన లేకుండా పోయింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిని రక్షించి.. ఆసుపత్రికి తరలించే వారిని గుర్తించి.. వారికి ప్రోత్సాహకాన్ని అందించే ఈ పథకం పేరు.. "గుడ్ సమరిటన్". ఈ పథకంలో భాగంగా రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని ఆసుపత్రికి తరలిస్తే.. ఈ పథకం కింద రూ.5వేల నగదుతో పాటు ప్రశంసాపత్రాన్ని అందిస్తారు. ఏడాది వ్యవధిలో ఎక్కువ మందిని కాపాడిన పది మందికి ఏటా రూ.లక్ష చొప్పున ప్రోత్సాహాన్ని అందిస్తారు. కేంద్రం తీసుకొచ్చిన ఈ పథకం 2026 మార్చి 31 వరకు అమల్లో ఉండనుంది. ప్రమాదం బారిన పడి..వారిని వెంటనే (గంట లోపు) ఆసుపత్రికి తరలించిన తర్వాత.. స్థానిక పోలీసులకు సమాచారం అందిస్తే.. స్టేషన్ అధికారిక లెటర్ ప్యాడ్ మీద 'ప్రాణదాత' అంటూ సేవ్ చేసిన వారి పేరు.. చిరునామాతో పాటు.. వారు చేసిన సాయాన్ని ధ్రువీకరిస్తూ లేఖ ఇస్తారు. ఆసుపత్రి వర్గాలు సైతం ప్రాణదాత వివరాల్ని ధ్రువీకరిస్తూ పోలీస్ స్టేషన్ కు సమాచారం అందిస్తాయి. అనంతరం పోలీసులు ఆ వివరాల్ని పరిశీలించి.. జిల్లాస్థాయి అప్రైజల్ కమిటీకి పంపుతారు. అక్కడి నుంచి ప్రాణదాతకు ప్రోత్సహం అందించాలని జిల్లా స్థాయి అప్రైజల్ కమిటీకి పంపుతారు. అక్కడి నుంచి ప్రాణదాతకు ప్రోత్సాహం అందించాలంటూ రాష్ట్ర రవాణా కమిషనర్ కు సిఫార్సు చేస్తారు. ఆపై.. సంబంధిత వ్యక్తికి రవాణా శాఖ అతడి బ్యాంక్ ఖాతాలో రూ.5వేలు జమ చేయటంతో పాటు ప్రశంసాపత్రాన్ని అందజేస్తారు. ఒక వ్యక్తి ఏడాదిలో గరిష్ఠంగా ఐదుసార్లు ఈ అవార్డు పొందే వీలుంది. ఇలా సాయం చేసే వారికి ఎలాంటి వేధింపులు.. నిర్బంధం లాంటి వాటి నుంచి గుడ్ సమరిటన్ చట్టం రక్షణ కల్పిస్తుంది. గాయపడిన వారిని ఆసుపత్రిలో చేర్చిన వెంటనే అక్కడి నుంచి వెళ్లిపోవచ్చు. వ్యక్తిగత వివరాల్ని సైతం ఇవ్వాల్సిన అవసరం లేదు. బాధితుడి చికిత్స కోసం ఖర్చు చేయాల్సిన అవసరం లేదు. ఇలా ఆసుపత్రికి తీసుకెళ్లిన వారు పోలీస్ స్టేషన్ చుట్టూ తిరగాల్సి ఉంటుందన్నది కూడా ఉత్త అపోహ మాత్రమే. అంబులెన్సుకు సమాచారం అందించి.. బాధితుల్ని ఆసుపత్రికి వెళ్లేలా చేసినా.. పోలీసుల నుంచి ఎలాంటి ఇబ్బంది ఉండదని పోలీసు ఉన్నతాధికారులు సైతం స్పష్టం చేస్తున్నారు. ఇంకెందుకు ఆలస్యం.. మనం కూడా గుడ్ సమరిటన్ అవుదాం. దానికి ముందు.. ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకూడదని మనస్ఫూర్తిగా కోరుకుందాం.

# పవన్ పోటీ స్టేట్మెంట్స్...అలెర్ట్ కావాల్సిందేనా ?



**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీలో ఈసారి చంద్రబాబు ప్రభుత్వం అని ఎవరూ అనడం లేదు. ఆ మాటకు వస్తే ఎన్డీయే ప్రభుత్వం అని బాబు పదే పదే చెబుతున్నారు. దాని వెనక ఆయన మార్క్ వ్యూహాలు ఉన్నాయి. మరి ఆ వ్యూహాలతో పాటు ఇబ్బందులూ ఉన్నాయి. కూటమి అంటే మూడు పార్టీల కలయిక. మూడు పార్టీల అధినాయకత్వాలు వేరు. వారంతా టీడీపీ కూటమి అధినేత ప్రభుత్వ సారధి బాబు మాటలు వింటారా అంటే సంకీర్ణ ధర్మం అయితే పాటించాల్సి ఉంటుంది. మూడు కాదు పాతిక పార్టీలు కలసిన ప్రభుత్వాన్ని ఒకనాడు ఢిల్లీలో వాజ్ పేయ్ ప్రధానిగా నాయకత్వం వహించి నడిపారు. ఆనాడు కూడా ఏ ఒక్క పార్టీ స్వతంత్రించి ప్రధానికి భిన్నంగా విధాన ప్రకటన అయితే చేయలేదు. ఇక కేంద్రంలో ఈసారి నరేంద్ర మోడీ ప్రభుత్వం మరో రెండు పార్టీల బలం మీద ఆధారపడి పాలన చేస్తోంది. అయినా మోడీ పాలనలో ఏ మిత్ర పక్షమూ జోక్యం చేసుకోవడం లేదు, ఎవరూ కూడా సాహసించి సలహాలు అయితే ఇవ్వడంలేదు. కానీ ఏపీలో మాత్రం భిన్నమైన పరిస్థితులు ఉన్నాయని తెలుగుదేశం పార్టీ శ్రేయోభిలాషి అయిన అనుకూల మీడియా అంటోంది.

ముఖ్యమంత్రికి పోటీగా ఉప ముఖ్యమంత్రి కూడా విధానపరమైన ప్రకటనలు చేస్తున్నారని దాంతో అధికారులు ఎవరి మాట వినాలో తెలియక గందరగోళం పడుతున్నారు అని అనుకూల మీడియా ఎత్తి చూపుతోంది. లేటెస్ట్ గా చూస్తే తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఎపిసోడ్ లో ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు అక్కడికి వెళ్ళి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అక్కడ బాధితులను కలసి ఓదార్చారు. అనంతరం టీటీడీ భవనంలో జరిగిన సంఘటన మీద సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. బాధ్యులైన వారిపై చర్యలు ఉంటాయని విచారణ కమిటీ ఏర్పాటు చేస్తామని అన్నారు. అయితే సీఎం హోదాలో బాబు ఇచ్చిన ప్రకటనకు భిన్నంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వేరేగా ప్రకటనలు ఇచ్చారు. అసలు ఆయన వేరేగా పర్యటన చేశారు. వేరేగా మీడియా మీటింగ్ పెట్టారు. అలాగే బాధ్యులుగా టీటీడీ చైర్మన్, ఈవో జేఈవో లను ముందు పెట్టారు. ఇలా బాబు ఒకటి చెబితే పవన్ మరొకటి చెప్పారు. దీంతోనే చర్చ మొదలైంది. దానికే అనుకూల మీడియా పట్టుకుంది. నిజానికి ఉప ముఖ్యమంత్రి అని అంటున్నా రాజ్యాంగంలో ఉప ముఖ్యమంత్రి అన్నది లేదని ప్రత్యేక అధికారాలు అంతకంటే లేవని కూడా అంటోంది. పవన్ సైతం ఒక మంత్రి మాత్రమే అని పేర్కొంది. ముఖ్యమంత్రి వెంట మంత్రులు అంతా వెళ్ళారని పవన్ జనసేన అధినేత హోదాలో ప్రత్యేకంగా బాధితులను పరామర్శ చేయవచ్చునని కానీ అదే సమయంలో ఆయన విధాన పరమైన ప్రకటనలు చేయడమ ఎందుకు అన్నట్లుగా ప్రశ్నించింది.

ఇది సంకీర్ణ ధర్మానికి ఇబ్బంది అవుతుందని కూడా పేర్కొంది. కూటమి ఐక్యంగా ఉండాలీ అంటే ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రి ఇద్దరూ చర్చించుకుని ఒకే మాట మీద ఉండాలని సూచించింది. ఈ విషయంలో పవన్ కొంత స్వతంత్రించి మాట్లాడుతున్న తీరు వల్ల ఫ్యూచర్ లో సమస్యలు వస్తాయని అంతిమంగా అది రాష్ట్రానికి నష్టం చేకూరుస్తుందని కూడా పేర్కొంది. మొత్తానికి చూస్తే పవన్ కళ్యాణ్ ఇచ్చిన స్టేట్మెంట్స్ మీదనే అనుకూల మీడియా అలెర్ట్ చేసింది. నిజానికి అనుకూల మీడియా చెప్పినది అందరికీ తెలిసిందే. రాజ్యాంగం ప్రకారం ఉప ప్రధాని ఉప ముఖ్యమంత్రులు అని ఉండరు మంత్రిగానే వారు ప్రమాణం చేస్తారు. ఇక ప్రధాని ముఖ్యమంత్రి కే విశేష అధికారాలు ఉంటాయి. వారే కీలక ప్రకటనలు చేస్తారు. విధానపరమైన నిర్ణయాలను వారే తీసుకుంటారు. పవన్ మిత్ర పక్షంగా ఉన్నారు. ఆయన ఏమైనా ప్రభుత్వ లోపాలను చెప్పాలీ అంటే నాలుగు గోడల మధ్యనే వివరించవచ్చు అన్న సూచనలు వస్తున్నాయి. కానీ పవన్ మాత్రం గతంలో హోం మంత్రిని విమర్శించిన సందర్భంలో కానీ ఇపుడు తిరుపతి తొక్కిసలాట ఘటన కానీ ఈ మధ్యలో కాకినాడ సీజ్ ది షిప్ ఉదంతాల్లో కానీ కొంత స్వేచ్ఛగానే వ్యవహరిస్తున్నారు. అయితే ఇవన్నీ కూటమి ప్రభుత్వం మీదనే ప్రభావం చూపిస్తాయన్నట్లుగా టీడీపీ అనుకూల మీడియా రాసుకొచ్చింది. మొత్తానికి ఒక విలువైన సూచనను కూటమి పెద్దలకు ఇస్తున్నట్లుగా ఇదంతా ఉంది. మరి దీని మీద ఎవరు ఎలా రెస్పాండ్ అవుతారో చూడాల్సి ఉంది.

# కార్చిచ్చుతో అమెరికాలో రాజకీయ రచ్చ



**హైదరాబాద్ పెన్ పవర్:** కష్టం వచ్చినప్పుడు చేయి.. చేయి కలపాలి. కష్టం నుంచి బయటకు వచ్చేందుకు ఉన్న అన్ని మార్గాలు అన్వేషించాలి. అవకాశం ఉన్న వనరుల్ని ఒక చోటుకు తీసుకొచ్చి సమస్యను పరిష్కరించే అంశం మీద ఫోకస్ చేయాలే తప్పించి.. గుడ్డు మీద ఈకలు పీకిన చందంగా.. దరిద్రపుగొట్టు రాజకీయాన్ని కష్ట సమయంలో తీసుకురాకూడదు. ఈ తీరు మన దేశ రాజకీయాల్లోనే కాదు.. అమెరికాలోనూ లేదన్న విషయం తాజాగా చోటు చేసుకుంటున్న పరిణామాల్ని చూస్తే అర్థమవుతుంది. మనకు మాదిరే ఏదైనా విపత్తు విరుచుకుపడిన వేళలో.. ప్రజలకు చేయాల్సిన సహాయక చర్యలు.. ప్రభుత్వానికి అండగా నిలవటం.. చేయి చేయి కలపి.. సమస్య తీవ్రతను తగ్గించే ప్రయత్నం చేయాలి. కానీ.. అమెరికాలో ఇప్పుడు అందుకు భిన్నమైన వాతావరణం ఉంది. గడిచిన కొద్ది రోజులుగా అమెరికాలోని లాస్ ఏంజెలిస్ ను కమ్మేసిన కార్చిచ్చుతో జరుగుతున్న నష్టం అంతా ఇంతా కాదు. ఇప్పటివరకు ఉన్న అంచనాల ప్రకారం దగ్గర దగ్గర రూ.15 లక్షల కోట్లుగా చెబుతున్నారు. దీనికి తోడు వేలాది విలాసవంతమైన ఇళ్లు మంటల్లో కాలిపోగా.. వేలాది ఎకరాల విస్తీర్ణం అగ్నికి ఆహుతై.. ఇప్పుడా ప్రాంతం మొత్తం దుమ్ముధూళితో మసకబారిపోయిన పరిస్థితి. ఇదిలా ఉండగా.. ఇప్పుడు దరిద్రపుగొట్ట రాజకీయం ఎంట్రీ ఇచ్చింది. కార్చిచ్చు తీవ్రత పెరగానికి కాలిఫోర్నియా గవర్నర్ గావిన్ న్యూసోమ్ కారణమంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు కాబోయే దేశాధ్యక్షుడు ట్రంప్. ఈ వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేసిన గావిన్ ఒక కౌంటర్ లేఖను విడుదల చేశారు. కార్చిచ్చు ప్రభావిత ప్రాంతాల్ని ట్రంప్ పర్యటించాలని.. బాధితుల్ని పరామర్శించాలన్నారు.

ఈ విషాదాన్ని రాజకీయం చేయొద్దన్న ఆయన.. తప్పుడు సమాచారం వ్యాప్తి చేయొద్దని ట్రంప్ కు చురకలు అంటించారు. ఆరేళ్ల క్రితం ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఈ తరహా ఘటన చోటు చేసుకుందని.. అప్పట్లో ఆయన పరామర్శించిన విషయాన్ని గుర్తు చేశారు. కాలిఫోర్నియా కష్టంలో ఉంటే.. రాజకీయం చేయటం సరికాదన్నారు. కార్చిచ్చు వేళ.. బైడెన్ సైతం సత్వరమే స్పందించారన్నారు. అయినప్పటికి ట్రంప్ మాత్రం తన నోటికి పని చెప్పటం మాత్రం అపట్లేదు. కాలిఫోర్నియా గవర్నర్ డెమొక్రటిక్ కాగా.. ట్రంప్ రిపబ్లికన్ అన్న విషయం తెలిసిందే.

దీంతో.. తన రాజకీయ ప్రత్యర్థిని ఇరుకున పడేలా ట్రంప్ తన నోటికి పని చెబుతున్నారు. దీనికి తగ్గట్లే ట్రంప్ తాజా వ్యాఖ్యలు ఉండటం గమనార్హం. వైట్ హౌజ్ నుంచి బైడెన్ వెళ్లిపోయే ముందు.. తనకు మిగిల్చింది కాలిఫోర్నియా కార్చిచ్చు అంటూ నోరు పారేసుకున్నారు ట్రంప్. ఇదిలా ఉంటే..కార్చిచ్చు నేపథ్యంలో కాలిఫోర్నియా గవర్నర్ గావిన్ న్యూసమ్ తో కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ఫోన్ లో మాట్లాడారు. అమెరికా కెనడాలు ఇరుగుపొరుగు దేశాలు మాత్రమే కాదు.. అంతకు మించి.. కష్టకాలంలో మేం స్నేహితులమనే విషయాన్ని కూడా గుర్తు చేస్తున్నా అంటూ సోషల్ మీడియాలో చేసిన పోస్టు ఆసక్తికరంగా మారింది.

# సెల్ఫీ తీసుకుంటూ వెనక్కి నడుస్తూ 5గురు చనిపోయారు



**హైదరాబాద్ పెన్ పవర్:** పండుగకు కాస్త ముందుగా చోటు చేసుకున్న విషాదం.. పలు కుటుంబాల్లో తీరని శోకాన్ని మిగిల్చింది. హైదరాబాద్ మహానగరానికి చెందిన కుర్రాళ్లు శనివారం సెలవు కావటంతో.. సరదాగా కొండపోచమ్మ సాగర్ డ్యాంలోకి దిగి.. సెల్ఫీల కోసం వెనక్కి నడుస్తూ మునిగిపోయిన దారుణం చోటు చేసుకుంది. సిద్దిపేట జిల్లాలో చోటు చేసుకున్న ఈ విషాద ఉదంతంలో ఏడుగురు స్నేహితుల్లో ఐదుగురు మృత్యువాత పడ్డారు. మిగిలిన ఇద్దరు ప్రాణాలతో బయటపడ్డారు. ముషీరాబాద్ ప్రాంతానికి చెందిన జతిన్.. మిర్గానిక్.. ధనుష్.. లోహిత్..దినేష్.. తాయిలు.. మహమ్మద్ ఇబ్రహీం ఏడుగురు మంచి స్నేహితులు. శనివారం వీకెండ్ కావటంతో ఉదయం 8 గంటల వేళలో టూవీలర్ వాహనాల మీద ఈ ఏడుగురు స్నేహితులు ముషీరాబాద్ నుంచి బయలుదేరారు. టూవీలర్ల మీద కొండపోచమ్మ జలాశయం సందర్శనకు వెళ్లిన వారు.. ఒక్కొక్కరుగా నీటిలోకి దిగి స్నానాలు చేస్తున్నారు. ఫోటోలు.. వీడియోలు తీసుకుంటూ సరదాగా గడుపుతున్నారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి ఒక్కొక్కరుగా గల్లంతయ్యారు. మహమ్మద్ ఇబ్రహీం.. మిర్గానిక్ లు ఇద్దరు ప్రాణాలతో బయటపడగా.. మిగిలిన వారు గల్లంతయయారు. జరిగిన ఉదంతంపై పోలీసులకు సమాచారం ఇవ్వటంతో.. ఘటనాస్థలానికి వారు చేరుకున్నారు. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టగా.. ఐదు మృతదేహాలను వెలికి తీశారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు. మరణించిన ఐదుగురిలో ధనుష్.. లోహిత్ ఇద్దరు అన్నదమ్ములు కావటం గమనార్హం. వీరిద్దరు భోలక్ పూర్ డివిజన్ లోని ఇందిరానగర్ లో నివసిస్తూ ఉంటారు. వీరి తండ్రికి ఫోటో స్టూడియో ఉంది. ఆయనకు ఒక కుమార్తె.. ఇద్దరు కుమారులు. చేతికి వచ్చిన కొడుకులు ఇద్దరూ..ఈ రకంగా మృత్యువాత పడటం మింగుడుపడనిదిగా మారింది. బన్సీలాల్ పేటకు చెందిన చీకట్ల దినేశ్వర్ ఇంజనీరింగ్ చదువుతుండగా.. అత్తాపూర్ లోని ఎస్పీ నగర్ కు చెందిన సాహిల్.. ఖైరతాబాద్ కు చెందిన జతిన్ డిప్లొమా చదువుతున్నాడు. జలాశయంలోకి దిగిన తర్వాత.. లోహిత్.. ధనుశ్.. దినేశ్వర్.. జతిన్ లు ఫోనో లో సెల్ఫీలు తీసుకుంటూ నీటిలోకి వెనక్కి నడుస్తూ లోతులోకి జారారు. రక్షించాలని ఆర్తనాదాలుచేశారు. వీరి పరిస్థితిని గుర్తించిన సాహిల్ వారిని కాపాడేందుకు వెళ్లడంతో వారు గట్టిగా పట్టుకున్నారు. తమను సేవ్ చేయాలని 20 నిమిషాల పాటు సాహిల్ అరిచినా ఎవరూ రాలేదు. ఇదిలా ఉండగా.. మిగిలిన ఇద్దరు భయంతో ఏడుస్తూ పరుగుతీసి..అక్కడ చేపలు పడుతున్న వారికి సమాచారాన్ని ఇచ్చి.. వారిని తీసుకొచ్చే లోపే.. ఐదుగురునీట మునిగారు. ఈ దుర్ఘటన గురించి సమాచారం అందినంతనే పోలీసులు రాగా.. కాసేపటికే సిద్దిపేట సీపీ అనూరాధ జలాయశయంవద్దకు వచ్చారు. గల్లంతైన వారి కోసం 20 మంది గజ ఈతగాళ్లను.. బోటను తెప్పించి గాలింపు చేపట్టారు. ఈ ప్రక్రియ మొత్తం మధ్యాహ్నం 1.30 గంటలకు మొదలుకాగా.. రాత్రి 7.30 వరకు సాగాయి. ఆ తర్వాత వారిని గుర్తించారు. ఈ విషాద ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ తరహా ఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు తగిన చర్యలు చేపట్టాలంటూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ ఉదంతం షాక్ కు గురి చేస్తోంది. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బీఆరఎస్ సీనియర్ నేత కేటీఆర్, హరీశ్ మొదలుకొని.. పలువురు ప్రముఖులు తన విచారాన్ని వ్యక్తం చేశారు. ఇలాంటి ప్రమాదాలు రిపీట్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# నేరేడు పండు ప్రయోజనాల్లో మెండు.. తెలిస్తే వదిలిపెట్టరు!

## మధుమేహులకు మేలు చేసే పండు ఇది

## ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ సీ లభ్యం

## జీర్ణప్రక్రియ, గుండె పనితీరును పెంచుతుంది



వర్షాకాలంలో విరివిగా, చౌకగా లభించే పండ్లలో నేరేడు పండు ఒకటి. దీన్నే జామూన్ అని కూడా అంటారు. నల్లగా, నిగనిగలాడుతూ కనిపించే ఇవి రుచిలో అద్భుతంగా ఉంటాయి. రుచిలోనే కాదు పోషకాలు కూడా మెండుగా ఉంటాయి. ఏటా కనీసం ఓ రెండు నేరేడు పండ్లు అయినా తినాలని, దీనివల్ల కాలేయ శుద్ధి జరుగుతుందని పెద్దలు కూడా చెబుతుంటారు. అసలు నేరేడు పండ్లలో ప్రయోజనాలు గురించి తెలిస్తే వాటిని తినకుండా ఉండలేరు. ఈ పండ్లలో గ్లైసిమిక్ ఇండెక్స్ తక్కువ. కనుక మధుమేహులతోపాటు అందరూ హ్యాపీగా తినేయవచ్చు. ఇవి మధురంగానే ఉన్నప్పటికీ రక్తంలోకి చక్కెరలు వెంటనే విడుదల కావు. నిదానంగా విడుదల అవ్వడం వల్ల బ్లడ్ షుగర్ పెరగదు.

జామూన్ లో ఉండే జాంబోలిన్, ఎల్లాజిక్ యాసిడ్ ఇన్సులిన్ సెన్సిటివిటీని పెంచి బ్లడ్ షుగర్ ను నియంత్రిస్తాయి. టైప్ 1తోపాటు, టైప్2 డయాబెటిస్ కంట్రోల్ చేయడానికి ఇది మంచి పండు. జామూన్ లో యాంటీ ఆక్సిడెంట్లు అయిన యాంథోసియానిన్స్ ఉంటాయి. ఫ్రీరాడికల్స్ ను తొలగించడంలో ఇది సాయపడుతుంది. ఆక్సిడేటివ్ స్ట్రెస్, ఇన్ ఫ్లమ్మేషన్ ను తగ్గిస్తుంది.

జామూన్ పాంక్రియాస్ ను స్టిమ్యులేట్ చేసి మరింత ఇన్సులిన్ ను ఉత్పత్తి చేస్తుందని కొన్ని అధ్యయనాలు వెల్లడించాయి. బ్లడ్ షుగర్ నియంత్రణకు ఇన్సులిన్ కీలకంగా పనిచేస్తుంది.

జామూన్ లోని బయో యాక్టివ్ కాంపౌండ్లు.. మధుమేహం కారణంగా తలెత్తే డయాబెటిక్ నెఫ్రోపతీ, డయాబెటిక్ రెటీనోపతి, న్యూరోపతి సమస్యల నియంత్రణకు సాయపడతాయి.

నేరేడు పండ్లలో జీర్ణప్రక్రియ సామర్థ్యాలను పెంచే గుణాలు ఉన్నాయి. కనుక జీర్ణ సంబంధ సమస్యలు ఉన్న వారు దీన్ని తినాలి.

వ్యాధి నిరోధక శక్తిని పెంచడంలోనూ జామూన్ సాయపడుతుంది. ఎందుకుంటే ఇందులో యాంటీ ఆక్సిడెంట్లతోపాటు విటమిన్ సీ కూడా లభిస్తుంది. దీన్ని రోజూ తినడం వల్ల వ్యాధులు, ఇన్ఫెక్షన్ల ముప్పు తగ్గుతుంది. జామూన్ లో కేలరీలు చాలా తక్కువ. కనుక బరువు పెరగరు. పైగా బరువు తగ్గించుకోవాలని అనుకునేవారికి ఇదొక ఆప్షన్.

యాంటీ ఆక్సిడెంట్లు, ఫైటో కెమికల్స్ ఉండడం వల్ల కొలెస్ట్రాల్ తగ్గించి, గుండెకు మేలు చేస్తుంది.

# గుండెపోటుకు ముఖ్య కారణం ఇదేనట..! తాజా అధ్యయనంలో వెల్లడి

**ఢిల్లీలోని జీబీ పంత్ ఆసుపత్రి వైద్యుల బృందం రీసెర్చ్**

**930 మంది హృద్రోగ బాధితులను పరిశీలించి రిపోర్ట్**

**అందులో 92 శాతం మంది ఒత్తిడితో బాధపడుతున్నట్లు వెల్లడి**



గుండెపోటు మరణాలతో పాటు హృద్రోగ సమస్యలతో బాధపడుతూ ఆసుపత్రులలో చేరే వారి సంఖ్య ఇటీవలి కాలంలో పెరుగుతోంది. చిన్నాపెద్దా తేడా లేకుండా గుండెపోటుతో హఠాత్తుగా కుప్పకూలిపోతున్న సంఘటనలు పెరుగుతున్నాయి. దీనిపై ఢిల్లీలోని జీబీ పంత్ ఆసుపత్రి వైద్యుల బృందం చేసిన పరిశోధనలో గుండెపోటుకు ప్రధాన కారణం ఒత్తిడేనని తేలింది. తాజాగా జరిగిన ఈ పరిశోధనా ఫలితాలను ఇండియన్ హార్ట్ జర్నల్ ప్రచురించింది.

హృద్రోగ సమస్యలతో ఆసుపత్రిలో చేరిన రోగులపై జీబీ పంత్ ఆసుపత్రి వైద్యుల బృందం అధ్యయనం చేసింది. తీవ్రమైన, స్వల్ప గుండెపోటుతో బాధపడుతూ ఆసుపత్రిలో చేరిన 903 మంది రోగుల ఆరోగ్య పరిస్థితిని నెల రోజుల పాటు శాస్త్రీయ పద్ధతిలో వైద్యులు పరిశీలించారు. రోగులలో మొత్తం 92 శాతం మంది ఒత్తిడితో బాధపడుతున్నట్లు తేలిందని చెప్పారు. వారిలో కొంతమంది అధిక ఒత్తిడితో మరికొందరు స్వల్ప స్థాయి ఒత్తిడితో బాధపడుతున్నారని తేల్చారు. మరీ ముఖ్యంగా ఒత్తిడితో బాధపడుతున్న వారిలో యువతే ఎక్కువగా ఉందని వివరించారు.

మారుతున్న జీవనశైలి వల్ల వ్యక్తిగతంగా, వృత్తిపరంగా చాలామంది ఒత్తిడితో బాధపడుతున్నారని, ఈ ఒత్తిడి గుండెపోటుకు దారితీస్తోందని ఈ అధ్యయనానికి నేతృత్వం వహించిన డాక్టర్ మోహిత్ గుప్తా వెల్లడించారు. గుండె పనితీరుపై ఒత్తిడి తీవ్ర ప్రభావం చూపిస్తోందని ఆయన వివరించారు. ఆసుపత్రిలో చేరిన రోగులలో ఎక్కువ మంది అక్యూట్ మయోకార్డియల్ ఇన్ఫారెక్షన్ (తీవ్రమైన గుండెపోటు)కు గురైనట్లు చెప్పారు. ఇందులో 53 శాతం సివియర్ హార్ట్ ఎటాక్‌కు గురికాగా, 38 శాతం ఓ మోస్తరు గుండెపోటుకు గురైనట్లు పేర్కొంది. ఒత్తిడికి తద్వారా హృద్రోగ సమస్యలు పెరగడానికి ధూమపానం, మద్యపానం, వ్యాయామం లేకపోవడం, బీపీ, ఇన్సులిన్ తగ్గడం తదితర కారణమని ప్రొఫెసర్ డాక్టర్ మోహిత్ గుప్తా వివరించారు.

# ఈ సంకేతాలు ఉంటే.. మీరు ఆరోగ్యంగా ఉన్నట్టే

**ఉదయం నిద్ర లేవగానే ఉల్లాసంగా అనిపించాలి**

**భారంగా, బద్ధకంగా, అలసటగా ఉండకూడదు**

**కురులు, కంటి సమస్యలు కనిపించకూడదు**

**నెలవారీ రుతుక్రమం సరైన సమయానికి రావాలి**



నిజంగా మనం ఆరోగ్యంగా ఉన్నామా? లేదా? ఎవరికి వారే దీన్ని తెలుసుకోవచ్చు. మనం ఎంత ఆరోగ్యవంతులమో మన శరీరమే చెబుతుంటుంది. ఆ సంకేతాలను పట్టుకుంటే చాలు సులభంగా అర్థం చేసుకోవచ్చు. ఈ సంకేతాల ఆధారంగా అవసరమైతే జీవనశైలి, ఆహారంలో మార్పులు చేసుకోవచ్చు.

చక్కని ఆరోగ్యానికి మంచి నిద్ర ఎంతో అవసరం. మంచి నిద్ర అంటే.. ఉదయం లేచిన తర్వాత నీరసంగా, అలసటగా, బద్ధకంగా, అశక్తంగా అనిపించకూడదు. ఉదయం నిద్ర లేచిన తర్వాత ఉల్లాసంగా, ఎంతో హాయిగా ఉండాలి. అలా అనిపిస్తే నిద్ర సైకిల్ మెరుగ్గా ఉన్నట్టు అర్థం. తగినంత సమయం నిద్ర పోతున్నారని అర్థం. ఉదయం లేచిన తర్వాత ఉల్లాసంగా లేకపోతే, తగినంత సమయం నిద్ర పోతున్నదీ, లేనిదీ గమనించుకోవాలి. తగినంత సమయం నిద్రించినా కానీ, అసలటగా, మగతగా అనిపిస్తుంటే శారీరక శ్రమ, పోషకాహారం లోపించినట్టు అర్థం చేసుకోవచ్చు.

శిరోజాల సమస్యలు నేటి తరంలో ఎక్కువగా కనిపిస్తున్నాయి. అవి జన్యు సంబంధితం అని అనుకుంటుంటారు. కాలుష్యం అని భావిస్తుంటారు. పోషకాహారం లోపించినా, ఒత్తిడి ఎక్కువైనా శిరోజాలు రాలిపోతాయని గుర్తు పెట్టుకోవాలి. మీ శిరోజాలు ఆరోగ్యంగా ఉండి, జుట్టు రాలే సమస్య లేకపోతే ఆరోగ్యంగా ఉన్నట్టే. శరీరం నుంచి వ్యర్థాలు మూత్రం ద్వారా బయటకు పోతాయి. మూత్రం రంగు స్పష్టంగా ఉంటే శరీరంలో నీటి పరిమాణం తగినంత ఉన్నట్టుగా అర్థం చేసుకోవాలి. డీటాక్సిఫికేషన్ ప్రక్రియ సజావుగా సాగుతుందని అర్థం. మూత్రం లేత పసుపు లేదా పారదర్శక రంగు కాకుండా మరీ ముదురు పసుపు, ఇతర రంగుల్లో వస్తుంటే అనారోగ్య సమస్యలకు సూచికగా భావించొచ్చు.

రోజువారీ మల విసర్జన సాఫీగా సాగిపోవాలి. ఈ కార్యక్రమం కోసం కష్టపడకూడదు. దానంతట అదే సంకేతం వచ్చి, విసర్జనకు వెళ్లేట్టు ఉండాలి. ఏరోజుకారోజు పెద్ద పేగు నుంచి మలం మలాశయంలోకి వచ్చి విసర్జితం అవుతుంటే.. జీర్ణ వ్యవస్థ క్రియలు సాఫీగా సాగిపోతాయి. లేదంటే పొట్ట ఉబ్బరం, గ్యాస్ తదితర సమస్యలు వేధిస్తాయి.

రోజువారీ కార్యకలాపాలను ఎలాంటి ఇబ్బంది లేకుండా చేసుకుంటూ.. వ్యాయామం కూడా చేసుకుంటూ ఉంటే, ఆ సమయంలో నొప్పులు, ఇతర ఇబ్బందులు లేకపోతే ఆరోగ్యంగా ఉన్నట్టు భావించొచ్చు. నోటి ఆరోగ్యం కూడా మొత్తం ఆరోగ్యంలో భాగం. నోటికి సంబంధించి ఎలాంటి సమస్యలు ఉండకూడదు. రోజులో రెండు సార్లు బ్రష్ చేసి, గార్గిలింగ్ చేసే వారికి ఈ సమస్యలు రావు. మహిళల్లో రుతుసరి (రుతు చక్రం) నెలవారీ క్రమం తప్పకుండా ఒకే సమయానికి వస్తుంటే వారు ఆరోగ్యంగా ఉన్నట్టుగానే భావించొచ్చు. రోజువారీ ప్రాణాయామం లేదా యోగా లేదా వాకింగ్ లేదా ఇతర వ్యాయామాలు చేసే క్రమం తప్పని అలవాటు ఉన్నవారు కూడా ఆరోగ్యంవంతులుగానే భావించొచ్చు. కళ్లు పొడిబారిపోవడం, కళ్లు ఎర్రబడడం, లేదా కంటి దురదలు వంటి సమస్యలు లేకపోతే కంటి ఆరోగ్యం సరిగ్గానే ఉన్నట్టు భావించాలి.

ఒక వయసు అంటే 40 ఏళ్లు దాటిన వారిలో మోకాలు, ఇతర కీళ్ల సమస్యలు కనిపించొచ్చు. కానీ, సమతులాహారం తీసుకుంటే, శారీరక, కండరాలు బలోపేతం అయ్యే వ్యాయామాలు చేస్తే ఇవి ఉండవు.

# అమెరికాలోని కార్చిచ్చు ఘటనపై స్పందించిన హీరోయిన్.. మేం బ్రతికిపోయాం అంటూ..



అమెరికాలోని లాస్ ఏంజిల్స్ లో జరిగిన కార్చిచ్చు ఘటనపై ప్రముఖ బాలీవుడ్ నటి ప్రీతి జింటా సోషల్ మీడియా వేదికగా స్పందించింది. ఇందులోభాగంగా ఇలాంటి రోజు చూడాల్సి వస్తుందని తన కలలో కూడా ఊహించలేదని అన్నారు. లాస్ ఏంజిల్స్లో నా ఫ్రెండ్స్, కుటుంబాలు ఎంతోమంది నిరాశ్ర యులయ్యారు. మన చుట్టూ ఉన్నవారికి జరిగిన విధ్వంసం చూసి నా హృదయ బరువెక్కింది. ఇలాంటి విషాదం సమయంలో మేము సురక్షితం గా ఉన్నందుకు దేవుడికి కృతజ్ఞతలు. గాలి త్వరలో నే తగ్గి మంటలు అదుపులోకి వస్తాయని ఆశిస్తున్నానని అన్నారు. ఇక ప్రాణాలను, ఆస్తిని కాపాడటానికి సహాయం చేస్తు న్న అగ్నిమాపక సిబ్బందితోపాటు ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. అందరూ సుర క్షితంగా ఉండండి అని ఎక్స్ లో ట్వీట్ చేశారు. కాగా.. నటి ప్రీతి జింటా అమెరికాలోని లాస్ ఏంజిల్లో తన భర్త జీన్ గూడెనఫ్ కలిసి అక్కడే నివసిస్తున్నారు. ఈ విషయం ఇలా ఉండగా నటి ప్రీతి జింటా తెలుగులో ప్రముఖ హీరో విక్టరీ వెంకటేష్ హీరోగా నటించిన ప్రేమంటే ఇదేరా అనే సినిమాతో తెలుగు ప్రేక్షకులకి పరిచయమైంది. %ఖ%అ తర్వాత బాలీవుడ్ లో ఎక్కువగా అవకాశాలు రావడంతో మళ్లీ తెలుగులో నటించలేదు. ప్రస్తుతం ప్రీతి జింటా హిందీలో సన్నీడియోల్ హీరోగా రాజ్కుమార్ సంతోషి దర్శకత్వంలో తెరకెక్కుతున్న పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'లాహోర్ 1947'లో ప్రీతీ ఓ కీలక పా త్ర లో నటిస్తుంది. ఈ సినిమా ఆగస్ట్ నెలలో రిలీజ్ కానున్నట్లు సమాచారం.

# కపిల్ దేవ్‌ను చంపడానికి వాళ్ళ ఇంటికి వెళ్ళాను: యువరాజ్ సింగ్ తండ్రి సంచలన వ్యాఖ్యలు





టీమిండియా దిగ్గజ ఆల్ రౌండర్ యువరాజ్ సింగ్ తండ్రి, భారత మాజీ ఫాస్ట్ బౌలర్ యోగరాజ్ సింగ్.. వరల్డ్ కప్ విన్నింగ్ కెప్టెన్ కపిల్ దేవ్ పై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ టీమిండియా మాజీ కెప్టెన్ పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తుతూ తన ఆవేదనను వెల్లడించాడు. తన కెరీర్ త్వరగా ముగిసి పోవడానికి కపిల్ దేవ్ కారణమని షాకింగ్ కామెంట్స్ చేశాడు. 1983 వన్డే ప్రపంచ కప్ భారత్ గెలిచిన తర్వాత కపిల్ దేవ్ ఎలాంటి కారణం లేకుండా తనను తొలగించాడని ఆరోపించాడు. అన్‌ఫిల్టర్డ్ బై సమ్దీష్‌లో యోగరాజ్ సింగ్ మాట్లాడుతూ.. " 1983 లో కపిల్ దేవ్ టీమిండియా కెప్టెన్ తో పాటు నార్త్ జోన్, హర్యానాకు కెప్టెన్ గా ఉన్నాడు. ఆ సమయంలో కపిల్ ఎటువంటి కారణం లేకుండా నన్ను తొలగించాడు. నా భార్య (యువీ తల్లి) నన్ను ఎందుకు జట్టు నుంచి తప్పించారో కపిల్ దేవ్ ను అడగాలనుకుంది. కపిల్ దేవ్ కు నేను గుణపాఠం చెబుతానని వాళ్ళ ఇంటికి నా పిస్టల్ తీసుకొని వెళ్ళాను. అతను తన తల్లితో బయటకు వచ్చాడు. కపిల్ దేవ్ తన తల్లితో బయటకు రాగానే "నేను మీ తలకు పిస్టల్ గురి పెట్టి చంపాలనుకున్నాను. నీ పక్కన నిలబడి ఉన్న మీ తల్లి కారణంగా నేను అలా చేయడం లేదు". అని యోగరాజ్ సింగ్ కపిల్ దేవ్ ను అన్నట్టు చెప్పారు.

డిసెంబర్ 21, 1980న బ్రిస్బేన్‌లో జరిగిన వన్డే మ్యాచ్‌లో ఆస్ట్రేలియాతో యోగరాజ్ సింగ్ తన అంతర్జాతీయ అరంగేట్రం చేశాడు. సునీల్ గవాస్కర్ కెప్టెన్సీలో అతను తన తొలి అంతర్జాతీయ మ్యాచ్ ఆడారు. యోగరాజ్ సింగ్ అంతర్జాతీయ కెరీర్ కేవలం మూడు నెలలకే పరిమితమైంది. భారత జట్టు తరపున ఒక టెస్టు, ఆరు వన్డేలు మాత్రమే ఆడాడు. క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత సినిమాల్లో నటించిన యోగరాజ్ సింగ్.. ఇన్నేళ్లలో కపిల్ దేవ్ గురించి మాట్లాడం ఇదే తొలిసారి. కపిల్ దేవ్ తో పాటు మాజీ స్పిన్నర్ బిషన్ సింగ్ బేడీపై యోగరాజ్ షాకింగ్ ఆరోపణలు చేశాడు. బిషన్ సింగ్ బేడీ తనపై కుట్ర పన్నాడని చెప్పుకొచ్చాడు.

# నిరుద్యోగులకు కాంగ్రెస్ గుడ్ న్యూస్.. నెలకు రూ.15 వేలు

న్యూఢిల్లీ: ఢిల్లీలోని నిరుద్యోగులకు కాంగ్రెస్ శుభవార్త చెప్పింది. వచ్చే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచి అధికారంలోకి వస్తే నిరుద్యోగ యువతకు ఏడాది పాటు రూ.8,500 చొప్పున ఆర్థిక సహాయం అందజేస్తామని హస్తం పార్టీ హామీ ఇచ్చింది. యువ ఉడాన్ యోజన పథకం కింద సహాయం చేస్తామని తెలిపింది. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి సచిన్ పైలట్ యువ ఉడాన్ యోజనను ఆదివారం (జనవరి 12) ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "కంపెనీ, ఫ్యాక్టరీ లేదా సంస్థలో నైపుణ్యాన్ని ప్రదర్శించగల యువతకు ఆర్థిక సహాయం అందిస్తాం. వారు ఈ కంపెనీల ద్వారా డబ్బు పొందుతారు. యువ ఉడాన్ యోజన ఇంట్లో కూర్చొని డబ్బు పొందే పథకం కాదు" అని పైలట్ పేర్కొన్నారు. 2025, ఫిబ్రవరి 5వ తేదీన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. దేశ రాజధానిలో అధికారమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ దూకుడు పెంచింది. గతంలో వరుసగా ఢిల్లీని పాలించిన కాంగ్రెస్.. రాజధానిలో పునర్ వైభవం కోసం ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగానే అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రజలకు హామీల వర్షం కురిపిస్తోంది గ్రాండ్ ఓల్డ్ పార్టీ. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ ఇప్పటికే రెండు ప్రధాన హామీలు ప్రకటించిన విషయం తెలిసిందే. ప్యారీ దీదీ యోజన స్కీమ్ కింద మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం ఒకటి, జీవన్ రక్ష యోజన పథకం కింద రూ. 25 లక్షల వరకు ఉచిత ఆరోగ్య బీమా కల్పిస్తామని కాంగ్రెస్ వాగ్ధానం చేసింది. తాజాగా యువ ఉడాన్ యోజన కింద నిరుద్యోగులకు సంవత్సరం పాటు నెలకు రూ.8500 ఇస్తామని హామీ ఇచ్చింది. ఢిల్లీలోని మొత్తం 70 అసెంబ్లీ స్థానాలకు ఫిబ్రవరి 5న ఒకే దశలో ఓటింగ్ జరగనుంది. ఫిబ్రవరి 8న ఓట్ల లెక్కింపు తర్వాత ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి.

# బీసీసీఐ రివ్యూ మీటింగ్.. రంజీ ట్రోఫీ ఆడనున్న కోహ్లీ, రోహిత్



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా స్టార్ ఆటగాళ్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలకు కష్టకాలం నడుస్తుంది. ఇప్పటికే టీ20 ఫార్మాట్ కు రిటైర్మెంట్ ప్రకటించిన ఈ దిగ్గజ ఆటగాళ్లు టెస్ట్ క్రికెట్ లో ఘోరంగా విఫలమవుతున్నారు. ముఖ్యంగా ఇటీవలే ఆస్ట్రేలియాతో జరిగిన బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో దారుణంగా నిరాశపరిచారు. రోహిత్ ఆడిన ఐదు ఇన్నింగ్స్ ల్లో సింగిల్ డిజిట్ కే పరిమితమయ్యాడు. చెత్త ఫామ్ కారణంగా చివరి టెస్ట్ లో హిట్ మ్యాన్ కు చోటు దక్కలేదు. మరోవైపు కోహ్లీ ఒక సెంచరీ మినహా మిగిలిన ఇన్నింగ్స్ ల్లో విఫలమయ్యాడు. జూన్ వీరిద్దరినీ బీసీసీఐ దేశవాళీ క్రికెట్ ఆడాలని సూచిందంట. రిపోర్ట్స్ ప్రకారం బీసీసీఐ రివ్యూ మీటింగ్ లో టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలను రంజీ ట్రోఫీ మ్యాచ్‌లు ఆడాల్సిందిగా కోరిందట. బోర్డు సమావేశంలో ఆటగాళ్లందరూ వీలు చిక్కినప్పుడల్లా దేశవాళీ క్రికెట్ ఆడాలని ఆదేశించినట్టు సమాచారం. ప్రధాన కోచ్ గంభీర్, చీఫ్ సెలెక్టర్ అగార్కర్ తో పాటు ఫిజియో అనుమతిస్తే మాత్రమే ఆటగాడు దేశవాళీ మ్యాచ్‌లకు దూరంగా ఉండొచ్చు. కానీ గంభీర్ ఇటీవలే ఆస్ట్రేలియా పర్యటన తర్వాత ఆటగాళ్లందరూ దేశవాళీ క్రికెట్ ఆడాలని సూచించాడు. దీంతో కోహ్లీ, రోహిత్ ను త్వరలో రంజీ ట్రోఫీలో చూసే అవకాశం ఉంది.

2025 డబ్ల్యూటీసీ టెస్ట్ సిరీస్ ను భారత్ జూన్ నెల నుంచి ప్రారంభించనుంది. ఇందులో భాగంగా ఇంగ్లాండ్ గడ్డపై భారత్ 5 టెస్టులు ఆడనుంది. ఈ సిరీస్ రోహిత్, కోహ్లీలకు కీలకం కానుంది. ఈ సిరీస్ లో విఫలమైతే వీరి టెస్ట్ కెరీర్ దాదాపు ముగిసినట్టే. రోహిత్ శర్మ చివరిసారిగా 2016లో దేశవాళీ మ్యాచ్ ఆడగా, విరాట్ కోహ్లీ 2012 నుంచి దేశవాళీ క్రికెట్ కు దూరంగా ఉంటూ వస్తున్నాడు. 2024లో టెస్ట్ క్రికెట్‌లో కోహ్లీ, రోహిత్ సగటు 25 కంటే తక్కువగా ఉంది. జనవరి 23 నుంచి రంజీ ట్రోఫీ ప్రారంభం కానుంది. ఇంగ్లాండ్ తో వన్డే సిరీస్, ఛాంపియన్స్ ట్రోఫీ ఉండడంతో రోహిత్, కోహ్లీ ఆడడం కష్టమే.

# ట్రిపుల్ సెంచరీతో చెలరేగిన 14 ఏళ్ళ అమ్మాయి.. స్మృతి మంధాన రికార్డును బద్దలు



**హైదరాబాద్ పెన్ పవర్:** అండర్ 19 క్రికెట్ లో 14 ఏళ్ల ముంబై ఓపెనర్ ఇరా జాదవ్ వన్డేల్లో సంచలన ఇన్నింగ్స్ తో మెరిసింది. ఆదివారం( ఫిబ్రవరి 12) అండర్ 19 క్రికెట్‌లో ట్రిపుల్ సెంచరీ చేసి ఔరా అనిపించింది. 14 ఏళ్ల ముంబై ఓపెనర్ అండర్ 19 వన్డే క్రికెట్‌లో ట్రిపుల్ సెంచరీ చేసిన తొలి భారత మహిళల క్రికెట్‌గా నిలిచి చరిత్ర సృష్టించింది. ఓవరాల్ గా 157 బంతుల్లో 346 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచింది. మేఘాలయతో జరిగిన మ్యాచ్ లో ఘనత సాధించింది. జాదవ్ మారథాన్ ఇన్నింగ్స్‌లో ఏకంగా 42 ఫోర్లు, 16 సిక్సర్‌లు ఉన్నాయి. ఇరా జాదవ్ విధ్వంసంతో ముంబై 50 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 563 పరుగుల భారీ స్కోరు చేసింది. భారత మహిళా దేశీయ క్రికెట్ లో ఇదే అత్యధిక స్కోర్ కావడం విశేషం. అండర్ 19 క్రికెట్ లో ఇప్పటివరకు అత్యధిక వ్యక్తిగత స్కోర్ చేసిన భారత మహిళా స్టార్ క్రికెటర్ స్మృతి మంధాన రికార్డును బద్దలు కొట్టింది. ఎనిమిదేళ్ల వయసులో మొదటిసారి బ్యాట్ పట్టిన 2025 డబ్ల్యూపీఎల్ వేలానికి తన పేరును నమోదు చేసుకున్నా అన్ సోల్డ్ గా మిగిలి పోయింది. జాదవ్ 220.38 స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేయడం విశేషం. ప్రస్తుతం జరుగుతున్న మహిళల అండర్ 19 వన్ డే ట్రోఫీలో జాదవ్‌కి ఇది రెండో మ్యాచ్. అంతకుముందు మ్యాచ్‌లో ఆమె 102 బంతుల్లో 10 ఫోర్లు, రెండు సిక్సర్లతో 88 పరుగులు చేసింది. ఇటీవలే ఓపెనింగ్ డోర్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో జాదవ్ మాట్లాడుతూ జెమిమా రోడ్రిగ్స్ తన రోల్ మోడల్ అని వెల్లడించింది.

# లిటన్ దాస్, షకీబ్‌కు నో ఛాన్స్.. ఛాంపియన్స్ ట్రోఫీకి బంగ్లాదేశ్ జట్టు ప్రకటన



**హైదరాబాద్ పెన్ పవర్:** ఛాంపియన్స్ ట్రోఫీ 2025 కోసం బంగ్లాదేశ్ తమ 15 మంది సభ్యుల జట్టును ప్రకటించింది. ఆదివారం (జనవరి 12) బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు ప్రకటించిన జట్టులో ఆల్ రౌండర్ షకీబ్ అల్ హసన్, వికెట్ కీపర్ లిట్టన్ దాస్‌లకు చోటు దక్కలేదు. ఎన్నో సంవత్సరాలుగా బంగ్లా విజయాల్లో కీలక పాత్ర పోషిస్తూ వస్తున్న షకీబ్ పై వేటు పడడం ఆశ్చర్యానికి గురి చేస్తుంది. గత ఏడాది ఐదు వన్డేల్లో ఆరు పరుగులు మాత్రమే చేసిన లిటన్ దాస్ కు సెలక్టర్లు చోటివ్వలేదు.

పాకిస్థాన్, యూఏఈ వేదికలుగా జరగబోయే ఈ మెగా టోర్నీలో బంగ్లాదేశ్ జట్టుకు నజ్ముల్ హొసైన్ శాంటో కెప్టెన్ గా వహరించనున్నాడు. సీనియర్ ప్లేయర్లు మహ్మదుల్లా, ముష్ఫికర్ రహీమ్‌లు జట్టులో స్థానం దక్కించుకున్నారు. ఛాంపియన్స్ ట్రోఫీ గ్రూప్ ఏ బంగ్లాదేశ్ ఉంది. భారత్, పాకిస్థాన్, న్యూజిలాండ్ జట్లు ఇదే గ్రూప్ లో ఉన్నాయి. ఈ మెగా టోర్నీలో బంగ్లాదేశ్ ఫిబ్రవరి 20 న తమ తొలి మ్యాచ్ ఆడనుంది. ఫిబ్రవరి 24 న న్యూజిలాండ్ తో.. ఫిబ్రవరి 27 న పాకిస్థాన్ తో మ్యాచ్ లు ఆడాల్సి ఉంది.

**ఛాంపియన్స్ ట్రోఫీకి బంగ్లాదేశ్ జట్టు:**
నజ్ముల్ హొసైన్ శాంటో (కెప్టెన్), మెహిదీ హసన్ మిరాజ్, సౌమ్య సర్కార్ , తంజిద్ హసన్, తాంజిద్ హృదయ్, ముష్ఫికర్ రహీమ్, మహ్మదుల్లా, జాకర్ అలీ, రిషాద్ హుస్సేన్, తస్కిన్ అహ్మద్, ముస్తాఫిజుర్ రెహమాన్ , పర్వేజ్ హొసైన్, తంజైమ్ హసన్ షకీబ్, నసుమ్ అహ్మద్, నహిద్ రానా




# బికినీ ట్రీట్ లో శ్రేయా క్యూట్ స్మైల్



టాలీవుడ్ లో చిన్న పాత్రలతో కెరీర్ మొదలుపెట్టిన శ్రేయా ధన్వంతరి ఇప్పుడు బాలీవుడ్ డిజిటల్ ప్రపంచంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంది. తాజాగా హవాయ్ లోని వైమనలో బీచ్ లో గడిపిన తన తాజా ఫోటోలను ఇన్‌స్టాగ్రామ్ లో పంచుకుంటూ మరోసారి నెటిజన్లను కట్టిపడేసింది. సముద్ర అలలతో ఆడుకుంటూ అందంగా సగరతీర సుందరిగా కనిపించిన శ్రేయా, కలర్ ఫుల్ బికినీలో తన ఫిట్‌నెస్ ను హైలైట్ చేస్తూ సోషల్ మీడియాలో హీట్ పెంచింది. ఈ ఫోటోల్లో ఆమె ట్రెండీ లుక్ కు తోడు ఆమె స్మైల్ కూడా అదనపు ఆకర్షణగా మారింది. "వాటర్ బేబీ" అని క్యాప్షన్ ఇచ్చి పలు ఫోటోలను షేర్ చేసిన ఆమె, ఫ్యాన్స్ నుంచి విశేష స్పందనను అందుకుంది. ట్రెండీ బికినీ లుక్ తో స్టన్నింగ్ గా మెరిసిన శ్రేయా, హవాయ్ సముద్ర తీరంలో తన మైదానాన్ని చూపించింది. సహజ సౌందర్యానికి పర్యావరణం కలిసివచ్చినట్లు ఆమె పిక్స్ చూస్తే అర్థమవుతోంది. ట్రెండీ డ్రెస్సింగ్ కి స్టైలిష్ పర్సనాలిటీ ని జోడించి ఫోటోలలో తన సొగసును కుర్రాళ్లకు ఆహ్లాదం చేస్తోంది. కెరీర్ విషయానికి వస్తే, శ్రేయా మొదట టాలీవుడ్ లో జోష్ వంటి చిత్రాలతో ప్రారంభించింది. తర్వాత "స్నేహగీతం" చిత్రంలో నటించి ప్రేక్షకులను పలకరించింది. అయితే ఈ చిత్రాలతో ఆశించిన గుర్తింపు రాకపోవడంతో ఆమె బాలీవుడ్ పై దృష్టి పెట్టింది. అక్కడ ఆమె "వై చీట్ ఇండియా" వంటి సినిమాతో మంచి పేరు సంపాదించుకుంది. ఇక వెబ్ సిరీస్ లో అయితే ఆమె తన కంటూ ఓ ప్రత్యేకమైన మార్క్ ను క్రియేట్ చేసుకుంది. "ది ఫ్యామిలీ మాన్" "స్కామ్ 1992" వంటి హిట్ ప్రాజెక్టులతో మరింత గుర్తింపు పొందిన శ్రేయా, నటనతో పాటు గ్లామర్ షోలోనూ తనదైన ముద్ర వేశారు.

ఇన్‌స్టాగ్రామ్‌లో యాక్టివ్‌గా ఉండే శ్రేయా, తరచుగా తన ఫోటోషూట్ లతో అభిమానులను అలరిస్తుంది. ఇటీవల బీచ్ లో ఫోటోలు షేర్ చేసి నెటిజన్ల మనసును దోచుకున్న ఈ సుందరి, ఫిట్‌నెస్ మరియు ఫ్యాషన్ కు సమపాళ్ళలో ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతోంది. ట్యాటూ డిజైన్ ను హైలైట్ చేస్తూ, తక్కువ డ్రెస్సింగ్ తోనూ ఆకర్షణీయంగా కనిపించగల అందం ఆమె సొంతం. ప్రస్తుతం శ్రేయా నెక్స్ట్ ప్రాజెక్ట్స్ పై దృష్టి పెట్టి బిజీగా ఉంది.




On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com